

ముఖాముఖి

జిల్లాకు మరో మూడు కొత్త ఆస్పత్రులు

» కూసుమంచి, ముదిగొండ, ఎర్రుపాలేనికి...
» జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రాజశేఖర్

ప్రశ్న: జిల్లాకు ఎన్ని కొత్తగా ఆస్పత్రులు మంజూరయ్యాయి?

జ: జిల్లాకు కొత్తగా మూడు ఆస్పత్రులు మంజూరయ్యాయి. వాటిలో ప్రస్తుతం కూసుమంచికి రూ.45కోట్లతో 100పడకల ఆసుపత్రి మంజూరైంది. దాంతో పాటు ముదిగొండలో రూ.22కోట్లతో 50 పడకలు, ఎర్రుపాలెంలో 50పడకలతో ఆస్పత్రికి రూ.22కోట్లు నిధులు విడుదలయ్యాయి.

ప్ర: కొత్త ఆస్పత్రులకు భవనాలు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయి?

జ: మధిర ఆస్పత్రిని ఇప్పటికే సీహెచ్‌సీ స్థాయి నుంచి 100 పడకలుగా రూ.34కోట్లతో అభివృద్ధి చేశాం. దీని భవన నిర్మాణం పూర్తయ్యింది. త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నాం. సత్తుపల్లిలోనూ 100పడకలతో ఆస్పత్రి పూర్తయ్యింది. కల్లూరులో 50 పడకలతో సీహెచ్‌సీగా రూ.11కోట్లతో పనులు కొనసాగుతున్నాయి. వైరాలోనూ 100పడకలతో ఏరియా ఆస్పత్రికి రూ.37 కోట్ల నిధులు విడుదలయ్యాయి. ఇక్కడ పనులు కొనసాగుతున్నాయి. తిరుమలాయపాలెం ఆస్పత్రిని 100 పడకలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు రూ.26కోట్లతో పనులు జరుగుతున్నాయి.

ప్ర: వైద్యవిధాన పరిషత్‌లో కొనసాగుతున్న ఆస్పత్రుల్లో వైద్యుల కొరత కూడా ఉంది కదా?

జ: దాదాపు అన్ని ఆస్పత్రుల్లో వైద్యుల పోస్టులను భర్తీ చేశాం. కొన్నిచోట్ల కొరత ఉన్నా సర్దుబాటు చేశాం.

ప్ర: కొన్ని ఆస్పత్రుల్లో వైద్యసేవలు అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి కదా?

జ: అలాంటిది ఏమీ లేదు. ప్రతి ఆస్పత్రిలో తరచుగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. వైద్యులు అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఏవైనా సేవలు అందకపోయినా, ఇబ్బందులు ఉన్నా తనకు ఫిర్యాదు చేయవచ్చు.

\- ఆంధ్రజ్యోతి, ఖమ్మం కలెక్టరేట్



వైరా రిజర్వాయర్ ఆయకట్టు రైతులకు గోదావరి జలాల స్వప్నం ఇంకా నెరవేరలేదు. ఈ సీజన్‌లో గోదావరి జలాలు వైరా రిజర్వాయర్‌కు చేరటంపై రైతుల్లో ఆశలు సన్నగిల్లాయి. వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలను తరలించేందుకు గతేడాది మార్చి 13న వైరాలో నలుగురు మంత్రులు రాజీవ్ లింక్ కెనాల్‌కు అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. శిలాఫలకం వేసి నేటికీ ఏడాది పూర్తవుతున్నా.. గోదావరి జలాలు వైరాను తాకలేదు. ఈ నెల ఐదో తేదీ రాత్రి సీతారామ కెనాల్ వందో కిలోమీటర్ వద్ద రాజీవ్ లింక్ కెనాల్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గోదావరి జలాలను విడుదల చేశారు. రాజీవ్ కెనాల్ నుంచి ఆ నీరు ఆరో తేదీన ఎన్నెస్పీ ఎడమకాల్వలో సాగర్ జలాలతో కలిసి ప్రయాణం మొదలుపెట్టాయి. గోదారి, కృష్ణమ్మల అనుసంధానానికి రాజీవ్ లింక్ కెనాల్ వేదికగా నిలిచినా.. మొదట ప్రకటించినట్లు ఇంతవరకు వైరాకు గోదావరి జలాలు రాలేదు.

వైరా చేరని గోదారి

» రాజీవ్ లింక్ కెనాల్‌కు శంకుస్థాపన చేసి.. నేటికి ఏడాది
» కాల్వ నిర్మాణం పూర్తయినా.. రిజర్వాయర్‌కు చేరని నీరు
» 13 కిలోమీటర్లు వెనక్కు నడిస్తేనే వైరాకు గోదావరి జలాలు
» ఇప్పుడున్న పరిస్థితుల్లో కష్ట సాధ్యమంటున్న అధికారులు

వైరా, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఎన్నెస్పీ 21 మెయిన్ బ్రాంచ్ కెనాల్‌లో సాగర్‌జలాలతో కలిసి గోదావరి జలాలు సత్తుపల్లి ప్రాంతానికి వెళుతున్నాయి. వైరాకు గోదావరి జలాలు రావాలంటే సుమారు 13 కిలోమీటర్ల దూరం సాగర్‌కాల్వలో వెనుకకు పయనించాల్సి ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో సాగర్‌కాల్వలో గోదావరి జలాలను వెనక్కి నడిపించి వైరాకు తరలించటం కష్టసాధ్యమేనని నీటిపారుదలశాఖ అధికారులు భావిస్తున్నారు.

గతేడాది మార్చి 13న అట్టహాసంగా శంకుస్థాపన..

నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధిశాఖ నుంచి సీతారామ ఎత్తిపోతల పథకంలో 18ఎల్ డిస్ట్రిబ్యూటరీ నిర్మాణం అలాగే మెయిన్ కెనాల్ కిలోమీటర్ 100.225వద్ద సర్‌ప్లస్ రెగ్యులేటర్ నిర్మాణానికి రూ.99.16కోట్ల అంచనాలతో గత ఏడాది మార్చి 13న వైరాలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లాకు చెందిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు మాలోతు రాందాస్‌నాయక్, మట్టా రాగమయి అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. గత ఏడాది ఆగస్టు 15నాటికి 8కిలోమీటర్ల లింక్ కెనాల్ నిర్మాణం పూర్తిచేసి గోదావరి జలాలను ఎన్నెస్పీ కాల్వలకు కలిపి వైరా ప్రాజెక్టు అలాగే వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లో 1.20లక్షల ఎన్నెస్పీ ఆయకట్టును స్థిరీకరిస్తామని మంత్రులు ప్రకటించారు. అందులో భాగంగానే ఆగస్టు 15న సీఎం రేవంత్‌రెడ్డితో సీతారామ ఎత్తిపోతల మోటర్లను ప్రారంభించి ఆ తర్వాత వైరాలో లక్షలాదిమంది రైతులతో రైతు పునర్నిర్మాణ సదస్సు నిర్వహించారు. దాంతో గోదావరి జలాలు వైరాకు వస్తాయని అంతా ఆశించారు. కానీ ఏడాది పూర్తవుతున్నా ఇంతవరకు గోదావరి జలాల జాడ లేదు.



వైరాలో నలుగురు మంత్రులు కలిసి వేసిన శిలాఫలకం

13కిలోమీటర్లు వెనక్కు నడిస్తేనే వైరాకు గోదావరి జలాలు

ఎన్నెస్పీ 21 మెయిన్ బ్రాంచ్ కెనాల్‌పై 38.629కిలోమీటర్ వద్ద నిమ్మవాగులోకి సాగర్‌జలాలను విడుదల చేసేందుకు ఎస్కేప్ లాకులను నిర్మించారు. ఆ ఎస్కేప్ లాకులకు ముందు భాగంలో అంటే 39వ కిలోమీటర్ వద్ద హెడ్ రెగ్యులేటరీని నిర్మించారు. హెడ్ రెగ్యులేటరీ గేట్లు దించి సాగర్‌జలాలను ఎస్కేప్ లాకుల నుంచి నిమ్మవాగు ద్వారా వైరాకు సరఫరా చేస్తున్నారు. అయితే ఇప్పుడు రాజీవ్ లింక్ కెనాల్‌ను ఎన్నెస్పీ 21ఎంబీసీలో 52వ కిలోమీటర్ వద్దనున్న హెడ్ రెగ్యులేటరీ సమీపంలో సాగర్‌కాల్వతో అనుసంధానం చేశారు. ఈనెల ఆరున వినోభానగర్ వద్ద లింక్ కెనాల్‌కు విడుదల చేసిన గోదావరి జలాలు 8కిలోమీటర్లు ప్రవహించి ఈ హెడ్‌రెగ్యులేటర్ సమీపంలో సాగర్‌కాల్వలోకి చేరాయి. ఆ నీళ్ల సత్తుపల్లి, కల్లూరు, పెనుబల్లి, వేంసూరు తదితర మండలాలకు ప్రవహిస్తున్నాయి. 52వ కిలోమీటర్ వద్దనున్న హెడ్‌రెగ్యులేటరీ సమీపంలో నాలుగున్నర మీటర్ల లోతులో సాగర్‌జలాలు ప్రవహిస్తాయి. అక్కడి నుంచి 39వ కిలోమీటర్ వద్ద ఉన్న హెడ్‌రెగ్యులేటరీ ఎస్కేప్ లాకుల వద్ద సాగర్‌జలాలు మూడు మీటర్ల లోతులో ప్రవహిస్తాయి. అంటే ఒకటిన్నర మీటర్ల లోతులో నీటి ప్రవాహం తేడా ఉంది. 52వ కిలోమీటర్ నుంచి 39వ కిలోమీటర్ వరకు వెనక్కు 13కిలోమీటర్ల దూరం గోదావరి జలాలను తీసుకురావాలంటే లింక్ కెనాల్ సమీపంలోని సాగర్‌కాల్వపై ఉన్న హెడ్ రెగ్యులేటరీని పూర్తిగా మూసివేయాలి. అప్పుడు మాత్రమే గోదావరి జలాలు ఎస్కేప్ లాకుల నుంచి నిమ్మవాగు ద్వారా వైరాకు చేరే అవకాశముంది. ఈ ఎస్కేప్ (మిగతా 6వ పేజీలో)

అభివృద్ధే నా ధ్యేయం

» దేశంలో ప్రముఖ నగరాల స్ఫూర్తితో ఖమ్మం అభివృద్ధి
» శాంతి భద్రతల విషయంలో రాజీపడేదిలేదు
» బీఆర్ఎస్ పాలనలో లాఅండ్ ఆర్డర్ లేదు
» ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు
» ప్రజాభిమానం ఉన్న వారికే 'కార్పొరేషన్'లో టికెట్లు
» వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల
» ఖమ్మంలో రూ.249 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీకి శంకుస్థాపన



ఖమ్మంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, మేయర్ నీరజ

ఖమ్మం, మార్చి12 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) భద్రాద్రి రామయ్య ఆశీస్సులతో జిల్లా అభివృద్ధే ధ్యేయంగా తన రాజకీయ జీవితం కొనసాగుతోందని, ఇందుకోసం 24గంటలు శ్రమించి పనిచేస్తానని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. దేశంలోని ప్రముఖ నగరాల స్ఫూర్తితో ఖమ్మం నగరాన్ని అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని తెలిపారు. రూ.2వేల కోట్లతో పనులు చేసి చూపిస్తానని ప్రకటించారు. అవసరమైతే రూ.2,500కోట్లు ఖర్చుచేస్తామన్నారు. ఖమ్మం నగరంలోని 10వ డివిజన్‌లో రూ.249 కోట్లతో 9.6కి.మీ మేర చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీకి బుధవారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం నగర అభివృద్ధికి రూ.2వేల కోట్లు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించానని, ఇందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఖమ్మం నగరంలో పూర్తి స్థాయి అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థను నిర్మించి ఆరోగ్యనగరంగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాల కృషి చేస్తున్నామని ప్రకటించారు. అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటుతో పాటు నగరంలో పచ్చదనం, పరిశుభ్రత ప్రతి ఇంటికి తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. దేశంలో ఖమ్మం నగరాన్ని మోడల్‌గా చేసి చూపిస్తామని, అందుకు ప్రజలు అన్నివిధాలా సహకరించాలని కోరారు. ఎక్కడైనా ఆక్రమణలు ఉంటే వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించి వాటిని తొలిగించాలన్నారు. ఎవరైనా రాజకీయ నాయకులు కానీ, పార్టీలు కానీ ఆక్రమణలను ప్రోత్సహిస్తే చర్యలు తప్పవని (మిగతా 6వ పేజీలో)



సబ్ జైల్ పరిసరాలను పరిశీలిస్తున్న డీఐజీ ఎం.సంపత్

రిమాండ్ ఖైదీ పరారీపై విచారణ

» గోడదూకాడా.. లేక జైలు బయటనుంచి పరారయ్యాడా?
» సత్తుపల్లి సబ్ జైల్‌ను సందర్శించిన జైళ్లశాఖ వరంగల్ డీఐజీ ఎం.సంపత్

సత్తుపల్లిరూరల్, మార్చి12 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి సబ్‌జైల్ నుంచి రిమాండ్ ఖైదీ పరారై పట్టుబడిన ఘటనపై జైళ్లశాఖ వరంగల్ డీఐజీ ఎం.సంపత్ విచారణ చేపట్టారు. సత్తుపల్లి సబ్‌జైల్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రిమాండ్ ఖైదీ పరారైన ఘటనపై సబ్‌జైల్ లోపల, బయటి పరిసరాలను పరిశీలించారు. ఖైదీలు బయటకు (మిగతా 6వ పేజీలో)

9వ తరగతి విద్యార్థులకు మహా అవకాశం

» ఇస్రో ఆధ్వర్యంలో యువ విజ్ఞాన్-2025 కార్యక్రమం
» 23 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు గడువు
» యువ శాస్త్రవేత్తలను తయారు చేయడమే ఇస్రో లక్ష్యం

6

ఆన్‌లైన్‌లో భద్రాద్రి శ్రీరామనవమి కల్యాణ టికెట్లు

» అందుబాటులో ఉంచిన దేవస్థానం అధికారులు
» 20 నుంచి సెక్టార్ టికెట్ల విక్రయాలకు ప్రత్యేక కౌంటర్లు

భద్రాచలం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 6న శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణం, ఏప్రిల్ 7న శ్రీరామ మహాపట్టాభిషేకం కార్యక్రమాలను ప్రత్యక్షంగా వీక్షించేందుకు టికెట్లను ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసేందుకు అందుబాటులో ఉంచారు. ఈ నెల30 నుంచి ఏప్రిల్ 12వరకు భద్రాద్రి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ ద్వారా సెక్టార్ టికెట్లు ముందస్తుగా పొందేందుకు దేవస్థానం అధికారులు అవకాశం కల్పించారు. కల్యాణోత్సవానికి ఉభయదాతల టికెట్ రూ.7,500, సెక్టార్ టికెట్లు రూ.2,500, రూ.1000, రూ.300, రూ.150 విక్రయించనున్నారు. అలాగే మహా పట్టాభిషేకానికి రూ.1,500 రూ.500, రూ.100 టికెట్లు విక్రయించనున్నారు. కల్యాణం, పట్టాభిషేకాన్ని ప్రత్యక్షంగా వీక్షించాలనుకునే భక్తులు bhadradritemple.telangana.gov.in అనే వెబ్‌సైట్‌లో టికెట్లు కొనుగోలు చేయాలని భద్రాద్రి దేవస్థానం (మిగతా 6వ పేజీలో)

నేడు భద్రాద్రిలో డోలోత్సవానికి అంకురార్పణ

రేపు రామయ్య కల్యాణ తలంబ్రాల తయారీకి శ్రీకారం 6



ప్రక్షాళన దిశగా సింగరేణి

» సంస్థలో నూతన సంస్కరణలకు సీఎండీ బలరాం శ్రీకారం
» సీఎంవోకు బదులు చీఫ్ మెడికల్ సర్వీసెస్ నియామకానికి కసరత్తు
» అవినీతి మరకలను తొలగించేందుకు ప్రయత్నం
» డైరెక్టర్ (పా) పోస్టు స్థానంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్?

రుద్రంపూర్, (సింగరేణి)మార్చి 12(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో నూతన సంస్కరణలు చేపట్టేందుకు సింగరేణి ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం సమాయత్తమవుతున్నారు. ముందుగా మెడికల్ బోర్డులో జరుగుతున్న అక్రమాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. గత కొంతకాలంగా సింగరేణి మెడికల్ బోర్డులో అన్‌ఫిట్ కావాలంటే లక్షలు కుమ్మరించాల్సిన పరిస్థితి ఉండేదన్న ఆరోపణలు ఉన్న నేపథ్యంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ పోస్టును తొలగించి సింగరేణికి, ప్రభుత్వ వైద్యులకు సంబంధం లేకుండా చీఫ్ మెడిల్ సర్వీసెస్ చేపట్టేందుకు చర్యలు చేపట్టారు. సింగరేణి ప్రధాన (మిగతా 6వ పేజీలో)

ఎండలో తిరుగుతున్నారా..

జాగ్రత్త!

అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ హెచ్చరికలు



రెడ్ అలర్ట్‌లో ఉన్న ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): క్రమక్రమంగా ఎండలు పెరుగుతున్నాయి. పగలు ఎండవేడి తీవ్రమవుతున్న నేపథ్యంలో దాని తీవ్రత నుంచి రక్షించుకునేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని ఇప్పటికే వైద్యాధికారులు సూచిస్తున్నారు. ఈ మేరకు ప్రజలకు అవగాహన కలిగించేలా అధికారయంత్రాంగం ప్రజలను హెచ్చరిస్తోంది. ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు చేయాల్సినవి.. చేయకూడని వాటిపై అవగాహన కోసం ఇవీ..

చేయాల్సినవి...

- ఎండదెబ్బ తగలకుండా టోపీ,గొడుగు, టవల్ ఉపయోగించాలి.
- కాటన్ దుస్తులు ధరించాలి. ఎండ వేళల్లో బయటకు వెళ్లొద్దు.
- తేలికపాటి ఆహారాన్ని తీసుకోవాలి. ప్రయాణంలో తాగునీరు వెంట తీసుకెళ్లాలి.
- తరచూ నిమ్మరసం, మజ్జిగ, పండ్ల రసాలు తీసుకోవాలి.
- చెవుల్లోకి వేడి గాలి వెళ్లకుండా జాగ్రత్త పడాలి.
- ఎండదెబ్బకు గురైనవారు ఓఆర్ఎస్ లేకుంటే, ఒక లీటరు నీటిలో ఉప్పు, పంచదారను కలిపి (తాగించాలి). తాగాలి
- ఎండ దెబ్బ తగిలిన వారిని వీలైనంత త్వరగా ఆస్పత్రికి తీసుకెళ్లాలి. అత్యవసర పరిస్థితిలో వైద్యులను సంప్రదించాలి.

చేయకూడనివి..

- మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు బయటకు వెళ్లకూడదు. సాధ్యమైనంత వరకు ఈ సమయంలో పనులను వాయిదా వేసుకోవడమే మంచిది.
- చిన్న పిల్లలు, గర్భిణులు, వృద్ధులు, గుండె జబ్బులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగకూడదు.
- నల్లటి దుస్తులు వేసుకోవద్దు. మద్యం, టీ, కాఫీ, శీతల పానీయాలు తాగకూడదు.
- మాంసాహారం, నిల్వ ఉన్న ఆహారం తినకూడదు.
- దాహం వేసినప్పుడు కూల్ డ్రింక్స్ తాగకూడదు. సొంత వైద్యం పాటించొద్దు.

రామయ్య కల్యాణ తలంబ్రాలు పరమ పవిత్రం

» అన్యోన్య దాంపత్యం కోసం వినియోగిస్తున్న భక్తులు

భద్రాచలం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): జానక్యాః కమలాంజలి పుటే యాః పద్మరాగాయితాః అనగా సీతాదేవి చేతుల్లో ఉన్న ముత్యాలు పద్మ రాగమణుల్లా ప్రకాశించాయి.... శ్రీరాముని శిరస్సుపై పడ్డ ఆ ముత్యాలు తెల్లని తలపాగా కాంతిలో కలిసి మంచి ముత్యాల్లా ప్రకాశించాయి.... నీలి మేఘచాయ కలిగిన శ్రీరాముని దేహం నుంచి జారిన తలం బ్రాలు ఇంద్రనీలామణుల్లా ప్రకాశించాయి.... అలాంటి సీతారాముల కల్యాణ ముత్యాల తలంబ్రాలు అందరికి సఖల శుభాలను కలుగజేస్తాయని భక్తులు విశ్వసిస్తుండటంతో వాటిని ఎంతో పరమపవిత్రంగా భావిస్తారు. భద్రాద్రి రామయ్య కల్యాణ తలంబ్రాలు ఎంతో ప్రసిద్ధి చెందాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశం నలుమూలల నుంచి ఈ తలంబ్రాల కోసం లక్షలాది మంది భక్తులు ఆరాట పడుతుంటారు. వివాహాల సమయంలో రామయ్య కల్యాణంలో వినియోగించిన తలంబ్రాలను అధిక శాతం మంది వినియోగిస్తుంటారు. దీని వలన నవదంపతులు సుఖ సంతోషాలతో అన్యోన్యంగా జీవిస్తారనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందులో భాగంగానే భద్రాద్రికి వచ్చిన ప్రతి ఒక్కరు రామయ్య తలంబ్రాలను తీసుకెళ్లేందుకు ఆరాటపడుతుంటారు.

ఈసారి 300 క్వింటాళ్లు తలంబ్రాలు

వివాహ వేడుకలను ప్రారంభించే సమయంలో తొలుత వినియోగించే పసుపు కొమ్ములను రోళ్లలో వేసి దంచడం మంగళ ఆరంభంగా పండితులు పేర్కొంటున్నారు. వాస్తవానికి హిందు సంప్రదాయ కల్యాణ వేడుకల్లో ఇదొక ప్రత్యేక సంస్కృతి. ఈ విధంగా చేయడం ద్వారా కల్యాణం నిర్వహణలో ఎటువంటి విఘ్నాలు చోటు చేసుకోవని వారు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రుత్వికుల సతీమణులతో పాటు ముత్తైదువులు పసుపుకొమ్ములను రోళ్లల్లో దంచే కార్యక్రమంను నిర్వహిస్తారు. అంతకు ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం తదితర ప్రత్యేక పూజలను దేవస్థానం అర్చకులు నిర్వహిస్తారు. అనంతరం పంచమంగళ ద్రవ్యాలైన బియ్యం, పసుపు, కుంకుమ, నెయ్యి, గులాంతో తలంబ్రాలను ముత్తైదువులు సిద్ధం చేయగా వాటికి సుగంధ ద్రవ్యాలను సైతం జోడించి తలంబ్రాల తయారీకి శ్రీకారం చుడతారు. శుక్రవారం 25 క్వింటాళ్ల కల్యాణ తలంబ్రాలను తయారు చేయనుండగా మొత్తంగా 300 క్వింటాళ్ల తలంబ్రాలను తయారు చేయనున్నట్లు దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి.



సీతారాముల కల్యాణంలో తలంబ్రాల ఘట్టం(ఫైల్)

భారీగా మిగిలిన ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లు

ముత్యాలు వేరు చేస్తున్న సిబ్బంది

భద్రాచలం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లు భారీగా మిగిలాయి. గత ఏడాది ఏప్రిల్ 17న శ్రీరామనవమిని పురస్కరించుకొని శ్రీ సీతా రామచంద్రస్వామి వారి కల్యాణంను నిర్వహించారు. అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లు సిద్ధం చేసి విక్రయించారు. అయితే విడతల వారీగా తలంబ్రాల ప్యాకెట్లును తయారు చేసి భక్తులకు విక్రయించే క్రమంలో చివరగా తయారు చేసిన ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లు సుమారు 28 వేల వరకు మిగిలినట్లు వినికిడి.

దీంతో సిబ్బంది దేవస్థానం పరిధిలోని ఒక సత్రంలో ఆ ప్యాకెట్లలో నుంచి ముత్యాలను వేరు చేసే ప్రక్రియను చేపడుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో ఈ విషయం బయటకు రావడంతో ఇందుకు సంబంధించి ఈవో రమాదేవి సిబ్బందిని మందలించినట్లు వినికిడి. ఇదిలా ఉండగా భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో గత ఏడాది శ్రీరామనవమి అనంతరం లక్ష ప్యాకెట్ల వరకు భక్తులకు విక్రయించారు. అలాగే కార్గో ద్వారా 46,400 ప్యాకెట్లు, పోస్టల్ శాఖ ద్వారా 2,500 ప్యాకెట్లు విక్రయించారు. కాగా చివరి విడతగా సిద్ధం చేసిన దాంట్లో సుమారు 28 వేల ప్యాకెట్లు మిగిలినట్లు తెలుస్తోంది.

మిగిలిన తలంబ్రాలను భక్తులకు పంపిణీ చేస్తాం

భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్ రమాదేవి

శ్రీరామనవమి అనంతరం విడతల వారీగా ఆన్‌లైన్, దేవస్థానం ప్రచార శాఖ , పోస్టల్, కార్గో ల ద్వారా వి క్రయాలకు అనుగుణంగా ముత్యాల తలం బ్రాల ప్యాకెట్‌లు సిద్ధం చేయటం జరుగుతోంది. చివరి విడతలో తయారు చేసిన 28 వేల ముత్యాల తలం బ్రాల ప్యాకెట్‌లు మిగిలాయి, ఈ క్రమంలో మిగిలిన 3.50క్వింటాళ్ల తలం బ్రాలను స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు నిర్ణయించాం. కాగా శు క్రవారం నుంచి శ్రీరామనవమి తలం బ్రాల తయారీ చేపట్టిన క్రమంలోఆన్‌లైన్, ప్రచార శాఖల ద్వారా ముత్యాల తలంబ్రాల విక్రయాలు నిలిపివేయటం జరిగింది



ముత్యాలు వేరు చేస్తున్న సిబ్బంది

వైభవంగా సాగుతున్న సమ్మక్క సారక్క జాతర

నేడు వనం రాక, నిండు జాతర ప్రారంభం

ఆళ్లపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి) ఆళ్లపల్లి మండలం, నడిమిగూడెం పంచాయతీ, సందిబందంలో బొమ్మలవారి ఇలవేల్పు అయిన సమ్మక్క-సారక్క జాతర వైభవంగా సాగుతుంది. మంగళవారం గుడి మండ మెలుగగా, బుధవారం గుట్ట నుంచి దేవుణ్ణి బొమ్మల వంశీయులు, సందిబంధం గ్రామస్థులు గిరిజన సంప్రదాయాలతో, శివశక్తుల పూనకాలతో దేవుణ్ని గర్భగుడికి చేర్చి గిరిజన ఆచారాలతో పూజలు నిర్వహించారు. నేడు గుట్ట నుంచి వనాన్ని తీసుకవచ్చి నిండు జాతర నిర్వహిస్తారు. కార్యక్రమంలో జోగరాంబాబు, కరకరాజు,సారయ్య, సమ్మయ్య, పూజారులు లక్ష్మీనర్సు, సరోజన, చంద్రమ్మ, సరిత, కాంతమ్మ, వెంకటేశ్వర్లు, నారాయణ పాల్గొన్నారు.



గుట్టనుంచి దేవుణ్ని తీసుకువస్తున్న గిరిజనులు

భగవద్గీత పోటీల్లో వైదేహికి బంగారు పతకం

ఏన్కూరు, మార్చి12(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఆన్‌లైన్ భగవద్గీత కంఠస్థ పోటీల్లో ఏన్కూరు మండలం తూతక్కలింగన్నపేట గ్రా మానికి చెందిన కట్టా వైదేహి అ త్యంత ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించింది. ఈనెల 11 మంగళవారం కర్ణాటక రాష్ట్రం మైసూరు గణపతి సచ్చిదానందస్వామి దత్తపీఠం వారు నిర్వహించిన పోటీల్లో వైదేమి 18 అధ్యాయాలు, 700శ్లోకాలను అలవోకగా కంఠస్థం చేసి అబ్బురపరిచింది. ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకానికి ఎంపికైంది. ఏప్రిల్ 4న మైసూరులో పీఠాధిపతుల చేతులమీదుగా గోల్డ్‌మెడల్ అందుకోనున్నారు. భగవద్గీత కంఠస్థ పోటీల్లో బంగారు పతకం సాధించిన వైదేహిని మండల ప్రజలు అభినందిస్తున్నారు.



ఎంపికైన వైదేహి

గ్రంథాలయ పాఠకులకు రెండు గ్రూప్-2 ర్యాంకులు

అభినందించిన పాఠకులు, సంస్థ సభ్యులు

చుంచుపల్లి, మార్చి12(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం గ్రంథాలయంలో పాఠకులుగా గత రెండేళ్లుగా చదువుకుంటున్న ఇద్దరు నిరుద్యోగులకు ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్-2 ర్యాంకుల్లో ఇద్దరికి ర్యాం కులు వరించాయి. ఎన్నో కష్టనష్టాలు ఎదు ర్కొంటూ కోచింగ్ తీసుకోలేని పరిస్థితుల్లో ఉన్న వీరు పూర్తిగా గ్రంథాలయాన్ని నమ్ముకొని ప్రణాళికబద్ధంగా పాఠ్యాంశాలను చదువుకున్న ఈ ఇద్దరు అభ్యర్థులు చివరికి విజేతలుగా నిలిచారు. దీంతో గ్రంథాలయానికి వచ్చే పాఠకులు ర్యాంకులు సాధించిన వీరికి బుధవారం శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం సాధిస్తా..

ధరావత్ వెంగళరావు, 377 మార్కులు



భద్రాద్రి జిల్లాలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యో గం సాధిస్తా. డిగ్రీ పూర్తి చేసి 2020లో కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించా. ఉద్యోగం చేసుకుంటూనే కొత్తగూడెం గ్రంథాలయాన్ని కేరాఫ్ అడ్రస్‌గా చేసుకొని గ్రూప్-2 పరీక్షల్లో 600 మార్కులకుగాను 377మార్కులు సాధించి 277ర్యాంక్ పొందాను. గ్రూప్-1 ర్యాంకు సాధించడమే లక్ష్యంగా రాబోయే రోజుల్లో మరోసారి తన ప్రతిభను చాటుకుంటానని పేర్కొన్నారు. మాది ఏన్కూరు మండలం భగవాన్‌నాయక్ తండా. మాది వ్యవసాయ కుటుంబం. గ్రూప్-2 ర్యాంక్ పొందినందుకు కుటుంబ సభ్యులు సంతోషంగా ఉన్నారు.

బావే నాకు స్ఫూర్తి

పోనుగంటి ఉపేందర్‌రావు, 380 మార్కులు



ఖమ్మం జిల్లా చింతకాని ప్రాంతానికి చెందిన నేను వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చా. డిగ్రీ పూర్తి చేశా. ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో చిరుఉద్యోగిగా పని చేసుకుంటూనే కొత్తగూడెం గ్రంథాలయాన్ని ఎంచుకొని గ్రూప్-2 చదువుకున్నా. చెల్లి భర్త వద్ద కొత్తగూడెంలో ఉంటూ రెండేళ్లుగా ప్రణాళిక బద్ధంగా చదువుకున్నా. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఫలితాల్లో 380 మార్కులు సాధించి 249 ర్యాంక్ పొందా. నా బావే నాకు స్ఫూర్తి. గ్రూప్-2లో ఏ పోస్టు ఇచ్చినా వంద శాతం కచ్చితంగా విధులు నిర్వహించి, ఆ పోస్టుకు వన్నె తెచ్చేందుకు ప్రయత్నిస్తా.

9వ తరగతి విద్యార్థులకు మహా అవకాశం

» ఇస్రో ఆధ్వర్యంలో యువ విజ్ఞాన్-2025 కార్యక్రమం

» 23 వరకు దరఖాస్తుకు గడువు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): యువ శాస్త్రవేత్తలను తయారు చేయాలనే ఉద్దేశంతో ఇస్రో 9వ తరగతి విద్యార్థులకు గొప్ప అవకాశాన్ని కల్పించింది. ఇస్రో ఆధ్వర్యంలో యువ విజ్ఞాన్-2025 కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీనికి ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకొనేందుకు అవకాశం ఉంది. ఈ దరఖాస్తులను ఇస్రో ఫిబ్రవరి 24 నుంచి మార్చి 23 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తోంది. యువవిజ్ఞాన్ కార్యక్రమాన్ని ఇస్రో 2019నుంచి నిర్వహిస్తోంది. పాఠశాల విద్యార్థులకు అంతరిక్ష సాంకేతికత, అంతరిక్షశాస్త్రంపై అవగాహన, వాటిని నిజ జీవితంలో ఉపయోగించుకోవటం వంటి ప్రాథమిక జ్ఞానం అందించటమే లక్ష్యంగా పనిచేస్తుంది. యువ సైంటిస్టులను తయారు చేయాలనే లక్ష్యంతో ఇస్రో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలో చదివే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ తెలిపారు.

దరఖాస్తు చేయాల్సిందిలా..

యువ విజ్ఞాన్-2025 కార్యక్రమానికి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో(డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఇస్రో.గౌట్.ఇన్)లో యువిక ఆప్షన్‌లో విద్యార్థుల వివరాలను పూర్తిచేసుకోవాలి. అనంతరం మెయిల్‌కు ఐడి లింక్ వస్తుంది. విద్యార్థి స్పేస్‌క్విజ్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. విద్యార్థులు 2025 జనవరి 1 నాటికి 9వ తరగతి చదువుతూ ఉండాలి. ఇంతకు ముందు సాధించిన సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. 8వ తరగతిలో వచ్చిన మార్కులను 50 శాతంగా తీసుకొని ఆన్‌లైన్ క్విజ్ ప్రతిభకు 10శాతం, గతంలో పాల్గొన్న జిల్లా, రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేయిర్‌కు 10శాతం, ఒలింపియాడ్‌లో పాల్గొన్న వాటికి 5శాతం, స్పోర్ట్స్‌లో పాల్గొన్న వాటికి 5శాతం, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ వాటికి 5శాతం, గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులకు 15శాతం తీసుకొని ఎంపిక చేస్తారు. ఏప్రిల్ 7న ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేస్తారు. ఎంపికైన విద్యార్థులకు మే 19 నుంచి 30వరకు ఇస్రోకు చెందిన అహ్మదాబాద్, డేరాడూన్, శ్రీహరికోట, తిరువానంతపురం, బెంగుళూరు, శిల్లాంగ్, హైదరాబాద్ తదితర కేంద్రాలలో శిక్షణ అందించనున్నారు. విద్యార్థులకు శిక్షణలో అంతరిక్షం సాంకేతికత, అంతరిక్ష శాస్త్రంపై అవగాహన, అంతరిక్షశాస్త్ర అనువర్తనాలపై ప్రాథమిక జ్ఞానం అందించనున్నారు. వివిధ చర్చా వేదికల్లో పాల్గొంటారు. అంతరిక్ష కేంద్రాల్లోని ప్రయోగశాల సందర్శన, ప్రముఖ శాస్త్రవేత్తలతో సమావేశం, ముఖాముఖి చర్చలు, రాకెట్ ప్రయోగాలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించనున్నారు.

ప్రక్షాళన దిశగా సింగరేణి

(5వ పేజీ తరువాయి)

కార్యాలయ ముఖ్య అధికారిగా విధులు నిర్వహించేందుకు ఆర్మీ, మిలటరీకి సంబంధించిన ఆసుపత్రుల్లో 15 సంవత్సరాల అనుభవం ఉన్న అధికారులను నియమించేందుకు నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. రెండు సంవత్సరాల కాలవ్యవధితో వైద్యుల నియామకానికి చర్యలు చేపట్టారు. ఆర్మీలో పని చేసిన అధికారులు సమర్థవంతంగా, అవినీతి రహితంగా విధులు నిర్వహిస్తారనే ప్రచారం ఉంది. దీంతో సింగరేణి యాజమాన్యం ఆర్మీ వైద్యులను నియమించేలా నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. రూ.2లక్షల వేతనంతో వసతి సౌకర్యాన్ని కల్పిస్తామని, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాని సూచించారు. అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని నోటిఫికేషన్‌లో తెలిపారు. ఈ నెల 31వ తేదీన చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్న డాక్టర్ సుజాత పదవీ కాలం ముగియనుంది. దాంతో ఆ పోస్టు కోసం భారీగా పైరవీలు జరుగుతున్న నేపథ్యంలో చీఫ్ మెడికల్ సర్వీసెస్ పోస్టు కోసం యాజమాన్యం నోటిఫికేషన్ విడుదల చేయడం చర్చనీయంశంగా మారింది. సీనియర్ వైద్యులు సీఎంవో పోస్టు కోసం పావులు కదుపుతున్న నేపథ్యంలో ఆర్మీ అధికారులను నియమిస్తారనే ప్రచారం పలువురు వైద్యులకు మిగుడు పడటం లేదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

డైరెక్టర్ (పా)నా.. ఎగ్జిక్యూటివ్ డైరెక్టరా ?

సింగరేణి కార్మికులకు సంబంధించిన సంక్షేమాన్ని పర్యవేక్షించే డైరెక్టర్(పా)పోస్టును తొలగించే పనిలో సింగరేణి యాజమాన్యం ఉందనే ప్రచారం సాగుతోంది. సింగరేణి డైరెక్టర్ (పా)కి బదులు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పోస్టు నియమిస్తారనే ప్రచారం జరుగుతోంది. సింగరేణి డైరెక్టర్(పా)గా విధులు నిర్వహించిన వెంకటేశ్వరరెడ్డి పదవీకాలం జనవరి 31తో ముగియడంతో ఫిబ్రవరి నుంచి ఇంతవరకు డైరెక్టర్(పా) పోస్టును భర్తీ చేయలేదు. దీంతో డైరెక్టర్ (పా) పోస్టుకు బదులు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను నియమించే అవకాశాలు ఉన్నాయని సింగరేణి ఉద్యోగులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. సింగరేణి చరిత్రలో ఒక డైరెక్టర్ పోస్టు ఇంతకాలం ఖాళీగా ఉన్న సందర్భం లేదని, ఇంత జాప్యం చేయడంపై కార్మికసంఘాలు ఆగ్రహంగా ఉన్నాయి. ఏది ఏమైనా త్వరలో ఈడీ పోస్టు వచ్చే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

నేడు భద్రాద్రిలో డోలోత్సవానికి అంకురార్పణ

భద్రాచలం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో డోలోత్సవానికి వసంతోత్సవానికి గురువారం సాయంత్రం అంకురార్పణ చేయనున్నారు. హోలీ పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం భద్రాద్రి రామయ్యకు డోలోత్సవం, వసంతోత్సవం నిర్వహించనున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో మార్చి 30న శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండగను పురస్కరించుకొని వసంత పక్ష ప్రయుక్త నవాహ్నిక శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఈక్రమంలో ఏప్రిల్ 6న శ్రీ సీతారామచంద్రస్వామికి కల్యాణం నిర్వహించనున్నారు. కాగా హోలీ పౌర్ణమిని పురస్కరించుకొని స్వామివారికి శుక్రవారం సహస్రధారతో ప్రత్యేక స్నపనం నిర్వహిస్తారు. అనంతరం స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించి ఊయలలో ఆశీనులను చేసి డోలోత్సవం నిర్వహిస్తారు. ఇదిలా ఉండగా శ్రీ సీతారామచంద్రస్వామి నవమి కల్యాణ తలంబ్రాల తయారీకి శుక్రవారం దేవస్థానం అధికారులు శ్రీకారం చుట్టనున్నారు. మొత్తం 300 క్వింటాళ్ల కల్యాణ తలంబ్రాలను సిద్ధం చేయనుండగా తొలిరోజు 25క్వింటాళ్ల తలంబ్రాలను తయారు చేయనున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

రేపే ఫాల్గునోత్తర మహోత్సవం

భద్రాద్రి రామాలయంలో శుక్రవారం సాయంత్రం శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి సన్నిధిలో ఫాల్గుణోత్తర మహోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీలక్ష్మీ మహిళా సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీ స్వర్ణలక్ష్మి అమ్మవారికి సామూహిక శ్రీలక్ష్మీ పూజలు దేవస్థానానికి నిర్వహించనున్నారు. రూ.500 చెల్లించిన భక్తులకు లక్ష్మి అమ్మవారి వెండి ప్రతిమ, లడ్డూ, పులిహోర ప్రసాదం, శ్రీ లక్ష్మి అమ్మవారి పూజా కుంకుమను అందిస్తారు. ఉదయం స్వర్ణలక్ష్మి అమ్మవారి అభిషేకం, నిర్వహించనుండగా ఇందులో పాల్గొనే భక్తులు రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. ముత్తైదువుకు లడ్డూ, పులిహోర ప్రసాద ప్యాకెట్‌ను అందజేస్తారు. కార్యక్రమాన్ని ప్రతిఏటా సంస్కృత పండితులు ఎస్టీజీ శ్రీమన్నారాయణాచార్యులు పర్యవేక్షణలో నిర్వహిస్తుండగా శ్రీ లక్ష్మి మహిళ సేవా సమితి సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొంటారు.

అభివృద్ధే నా ధ్యేయం

(5వ పేజీ తరువాయి)

హెచ్చరించారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ప్రజల్లో ఉండి పనిచేయాలన్నారు. భారీ వర్షాలు, వరదలు వచ్చినా నగరం ముంపు భారిన పడకుండా సరికొత్త డ్రెయినేజీ వ్యవస్థ రాబోతోందన్నారు. అధికారులు పనుల్లో జాప్యం చేయకుండా సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. ఖమ్మం పట్టణంలో రోడ్లను ఆక్రమించి ర్యాంపులు నిర్మిస్తున్నారని వాటినికూడా తొలిగించాలని సూచించారు. గత బీఆర్ఎస్ పాలనలో లాఅండ్ఆర్డర్ గాడి తప్పిందన్నారు. ప్రస్తుతం ఖమ్మం ప్రజలు స్వేచ్ఛ, సుఖ సంతోషాలతో జీవించేలా, ఎవరి స్థలాలు ఎవరు ఆక్రమించకుండా ఉండేలా శాంతిభద్రతలు కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అధికారులు ఎంతకాలం పనిచేసినా వారు చేసే అభివృద్ధి పనులు మాత్రం ప్రజల్లో శాశ్వతంగా ఉంటాయని తెలిపారు.

ప్రజల్లో ఉండేవారికే కార్పొరేషన్ ఎన్నికలలో టికెట్లు

ఎన్నికల్లో డబ్బులతోనే గెలవలేరని, ప్రజాభిమానం ఉన్నప్పుడే కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపు సాధ్యమవుతుందన్నారు. ఇప్పటినుంచే ప్రజలతో మమేకమై అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ముందుకు సాగాలన్నారు. రాబోయే వందేళ్లను దృష్టిలో పెట్టుకుని ఖమ్మం నగరంలో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ప్రజల్లో ఉండి పనిచేయాలన్నారు. ప్రజలు కోరుకున్న పనులనే చేపట్టాలి తప్ప మన అవసరాల కోసం ఎక్కడా ఏపనీ చేపట్టకూడదన్నారు. అబివృద్ధిలో ప్రజాభాగస్వామ్యం ఉన్నప్పుడే ప్రజలు కూడా స్థానిక నేతల వెంట ఉంటారన్నారు. పనిచేసే అధికారులను ఇబ్బందులకు గురిచేస్తే అభివృద్ధి పనులు ముందుకుసాగవన్నారు.

ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ మంత్రి తుమ్మల కృషితోనే కేంద్రం నుంచి ఖమ్మంలో భూగర్భ డ్రెయినేజీ నిధులు మంజూరైనట్లు తెలిపారు. దేశంలోని ప్రముఖ నగరాలకు మాత్రమే భూగర్భ డ్రెయినేజీ నిధులు మంజూరు చేస్తారని, అలాంటిది ఖమ్మం నగరానికి కూడా భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థకు నిధులు మంజూరు కావడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. ఖమ్మంలో అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేస్తామన్నారు. మున్నేరు వరదల సమయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా పని చేసి ప్రజల ఇబ్బందులు తొలిగించగలిగామని తెలిపారు. మం త్రి తుమ్మల దూరదృష్టితో ప్రణాళికలు రూపొందించడం ద్వారా ఆయా పనులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడుతున్నాయన్నారు. నగర ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఖమ్మం సీపీ సునీల్‌దత్ మాట్లాడుతూ ఖమ్మంలో గంజాయి వంటి మత్తుపదార్థాల విక్రయాలను పూర్తిగా నివారిస్తున్నామన్నారు. సీసీ కెమెరాల ద్వారా నగరంలో నిఘాను పటిష్టం చేశామన్నారు. ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ ఖమ్మం నగరాన్ని పుణె కార్పొరేషన్‌కంటే మిన్నగా అభివృద్ధి చేసేందకు కార్యచరణ రూపొందిస్తున్నామన్నారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో ఇకపై ఖమ్మం నగరం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. సభలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహార, కార్పొరేటర్లు కమర్తపు మురళి, మాజీ కార్పొరేటర్ చావా నారాయణరావు, ఆర్డీవో నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో భద్రాద్రి శ్రీరామనవమి కల్యాణ టికెట్లు

(5వ పేజీ తరువాయి)

ఈవో ఎల్.రమాదేవి సూచించారు. కాగా ఈ నెల 20 నుంచి సెక్టారు టికెట్లు భద్రాచంలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయించనున్నామన్నారు. భద్రాద్రి ఆలయం వద్ద మెయిన్ టికెట్ కౌంటర్, తానీషా కల్యాణ మండపం, బ్రిడ్జి రోడ్డు సీఆర్‌వోలో టికెట్లు విక్రయించనున్నట్లు తెలిపారు. భద్రాచలం ఆర్డీవో కార్యాలయంలో ఏప్రిల్ ఒకటి నుంచి అందుబాటులో ఉంటాయన్నారు. ఇదిలా ఉండగా ఈ ఉత్సవాలకు వచ్చే అవకాశం లేని భక్తుల సౌకర్యార్థం గతంలో మాదిరిగా పరోక్షంగా భక్తులు వారి గోత్రనామాలతో కల్యాణం జరిపించుకోవడానికి పరోక్ష సేవలకు రూ.5వేలు, రూ.1,116 టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. కాగా ఆన్‌లైన్‌లో సెక్టారు టికెట్లు బుక్ చేసుకున్న భక్తులు ఈ నెల 20 ఉదయం 11 గంటల నుంచి ఏప్రిల్ ఆరో తేదీ ఉదయం 6 గంటల వరకు దేవస్థానం తానీషా కల్యాణ మండప కార్యాలయంలో ఉన్న సీఆర్‌వోలో ఒరిజినల్ గుర్తింపు కార్డు చూపించి టికెట్లు పొందవచ్చని సూచించారు.

రిమాండ్ ఖైదీ పరారీపై విచారణ

(5వ పేజీ తరువాయి)

వెళ్లే అవకాశం ఉందా లేదా అని గోడల ఎత్తుతో పాటు గోడలపై ఫెన్సింగ్‌కు విద్యుత్ సరఫరా, చుట్టూ సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా లేదా అని పరిశీలించారు. జైలులోని 12మంది ఖైదీలతో పాటు సిబ్బంది, సబ్‌జైల్ సూపరింటెండెంట్‌లతో మాట్లాడి వివరాలను లిఖితపూర్వకంగా నమోదు చేసినట్లు తెలిసింది. జైలు చుట్టూ చెట్లను తొలగించాలని, బయట చెత్తాచెదారంతో పాటు డ్రైనేజీలను పరిశీలించి శుభ్రం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సత్తుపల్లి సబ్‌జైల్ నుంచి ఖైదీ జైలు గోడ దూకి వెళ్లాడా.. లేక బయడ ఊడ్చేందుకు తీసుకొస్తే పరారయ్యాడా అనే కోణంలో విచారణ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా సబ్‌జైళ్ల అధికారి జీ.వెంకటేశ్వర్లు, సత్తుపల్లి సబ్‌జైల్ సూపరింటెండెంట్ సోమరాజు ప్రవీణ్ పాల్గొన్నారు.

గద్దెలపై కొలువుతీరిన ముసలమ్మ తల్లి

కరకగూడెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చొప్పాల పంచాయతీలోని చొప్పాల గ్రామంలో కొలువుతీరిన ముసలమ్మ తల్లి ఆలయంలో 11న జాతర ప్రారంభమైంది. బుధవారం ముసలమ్మ తల్లిని పూజారులు గద్దెలపై కొలువు తీర్చారు. గురువారం భక్తిశ్రద్ధలతో వన దేవతను గుట్టనుంచి తీసుకొచ్చిగద్దెలపై వనదేవతలను కొలువు తీర్చుతారు. భక్తులకు దేవర బాలలు తాటి లక్ష్మి, తేలెం అణసూర్య, జిగట సత్యం తీర్థ ప్రసాదాలను అందజేస్తారు.

వైరా చేరని గోదారి

(5వ పేజీ తరువాయి)

లాకుల సామర్థ్యం 800క్యూసెక్కులు మాత్రమే. రాజీవ్ లింక్ కెనాల్ నుంచి సాగర్‌కాల్వకు 600క్యూసెక్కుల నీరు మాత్రమే ప్రవహిస్తున్నట్లు సమాచారం. ఆ నీటిని పూర్తిగా 13కిలోమీటర్లు వెనక్కి నడిపించి వైరాకు పంపించినా సుమారు 20రోజులకు ఒక టీఎంసీ నీరు వైరాకు చేరే అవకాశముంది. ఈ క్రమంలో 52వ కిలోమీటర్ నుంచి 9కిలోమీటర్ల దూరంలో గిన్నెల వాగు ఉంది. ఆ వాగు వద్ద ఎన్నెస్పీ కాల్వపై ఎస్కేప్ లాకులు నిర్మించి దాని ద్వారా వాగులోకి నీరు వదిలి నిమ్మవాగు నుంచి వైరాకు గోదావరి జలాలు సరఫరా చేసే అవకాశముంది. అంటే నాలుగు కిలోమీటర్ల దూరం బ్యాక్‌వాటర్‌ను తీసుకువెళ్లే దూరం తగ్గుతుంది. ప్రస్తుతం ఓ వైపున ఎండల తీవ్రతతో సాగర్ ఆయకట్టుకు సరిగా నీరందక రైతులు ఇబ్బందిపడుతున్నారు. ఈ సమయంలో సాగర్‌జలాల సరఫరాను నిలిపివేసి వైరాకు బ్యాక్ వాటర్ ద్వారా గోదావరి జలాలను సరఫరా చేయటం అసాధ్యమేనని అధికారులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో గోదావరికి భారీగా వరదలు వచ్చిన సమయంలో అంటే వర్షాకాలంలోనే మాత్రమే గోదావరి జలాలను వైరాకు తరలించే అవకాశాలున్నాయన్న చర్చ జరుగుతోంది.

భద్రాచలానికి పాదయాత్ర



పాదయాత్రగా వెళుతున్న రామభక్తులు

జూలూరుపాడు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సీతారాముల కల్యాణానికి వినియోగించే గోటి తలంబ్రాలను సమర్పించేందుకు బుధవారం వివిధ గ్రామాలకు చెందిన రామభక్తులు భద్రాచలానికి పాదయాత్రగా తరలివెళ్లారు. జూలూరుపాడు మండలంలోని పెద్దహరిజనవాడ గ్రామానికి చెందిన 40 మంది రామభక్తులు గ్రామంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి గోటితలంబ్రాలతో వెళ్లారు. అదే విధంగా ఖమ్మం జిల్లా రఘునాధపాలెం మండలం ఈర్లపూడికి చెందిన, ఏన్కూర్‌కు చెందిన భక్తులు భద్రాచలానికి పాదయాత్రగా వెళ్లారు. జూలూరుపాడులో వారికి రామభక్తులు స్వాగతం పలికి అల్పాహారాన్ని అందించారు. భక్తులు రామనామ స్మరణలను ఆలపించారు. గోటి తలంబ్రాలను భద్రాచలం రామలయంలో అందిస్తామని భక్తులు తెలిపారు.

యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా జెర్రిపోతుల

నేలకొండపల్లి,మార్చి12(ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి, నేలకొండపల్లికి చెందిన జెర్రిపోతుల అంజనీని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేసారు. అంజనీ మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఇన్‌ఛార్జిగా నియమించిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డికి, అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అంజని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఇన్‌చార్జ్‌గా నియమితులైన సందర్భంగా అంజనీకి పలువురు యువజన కాంగ్రెస్, కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలిపారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీలలో రజతం



ఖమ్మం స్పోర్ట్స్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఇటీవల బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరిగిన జాతీయస్థాయి యూత్ అథ్లెటిక్స్ పోటీలలో నగరానికి చెందిన అథ్లెటిక్స్ క్రీడాకిరిణి వైశాలి సత్తా చాటి రజత పతకం సాధించింది. సర్దార్ పటేల్ స్టేడియంలోమ నిత్యం సాధన చేసే ఆమె జాతీయ పోటీలో హెప్టాథ్లాన్ విభాగంలో ఫైనల్స్ పోటీలో ద్వితియ స్థానంలో నిలిచి రజత పతకం సాధించింది. ఈ సందర్భంగా జాతీయ స్థాయి పోటీలలో ప్రతిభ చూపిన వైశాలిని డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ గౌస్, అథ్లెటిక్ సంఘం జిల్లా కార్యదర్శి షఫీక్ అహ్మద్ అభినందించారు. భవిష్యత్ పోటీలలో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని కోరారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి

జూలూరుపాడు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు, రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు కృషి చేస్తామని ట్రాన్స్‌కో ఎస్ఈ మహేందర్ తెలిపారు. బుధవారం మండలంలోని కాకర్ల గ్రామాన్ని ఆయన సందర్శించి సబ్‌స్టేషన్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రైతు పొలంబాల కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాకర్ల గ్రామంలో రూ. 1.05కోట్ల నిధులతో 33/11 కెవి సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలు ఉన్నట్లయితే తమ శాఖ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో డీఈ రంగస్వామి, ఏడీఈ రవి, ఏఈ సతీష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

విద్యార్థులకు పాఠాలు బోధించిన కలెక్టర్



పాఠం బోధిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్ష ఫలితాలు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు తొలిమెట్టు అని, ఉన్నత విద్య లక్ష్య సాధనకు దిక్సూచిగా నిలుస్తాయని, చదువుతోనే ప్రతి ఒక్కరికి సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం నగరంలోని పాండురంగాపురం ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వసతి సదుపాయాలు, విద్యా బోధన, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు పలు అంశాలపై బోధన చేశారు. జువాలజీ పాఠ్యాంశాలపై విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాలను తెలుసుకున్నారు. పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు పాఠాలు మంచిగా బోధిస్తున్నారా, పాఠాల బోధనపై ఎమైనా సందేహాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పరీక్షల సమయంలో ధైర్యంగా ఒత్తిడి లేకుండ ఉండే పలు విషయాలపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థికి జీవితంలో ఒక గొప్ప లక్ష్యం ఉండాలని, దాని సాధన దిశగా కృషి చేయాలని అన్నారు. పదోతరగతి ఫలితాల్లో ఎన్ని మార్కులు వస్తాయి అని విద్యార్థులు ఆలోచించకుండా భవిష్యత్తు లక్ష్యాలను చేరుకోవటానికి కష్టపడి చదవాలని సూచించారు. పరీక్షలకు 10 రోజల సమయం ఉన్నందున కాలన్ని వృథా చేయకుండా విద్యార్థులు సమన్వయంతో చదువుకోవాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు సహకారం అందించాలని అన్నారు. విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం పాఠవాల ఉపాధ్యాయులకు విద్యా బోధన, పరీక్షల పట్ల పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులకు మరింత బాధ్యత ఉంటుందని, బడుగు బలహీన వర్గాల పిల్లలు అధికంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతారని, వీరిపై ప్రత్యేక శ్రద్ధ వహించి జీవితంలో పెద్ద స్థాయికి చేరేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు: ఎస్పీ



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురి చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, రోడ్డు ప్రమాదాల నియంత్రణ కొరకు నిత్యం తనిఖీలు చేపడతూ వాహనదారులకు అవగాహన కల్పించాలని ఎస్పీ రోహిత్ రాజు కోరారు. జిల్లా పోలీసు అధికారులతో బుధవారం ఏర్పాటు చేసిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెలలో వర్టికల్స్ వారీగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రశంశాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అక్కడ నివారణ చర్యలను చేట్టాలని సూచించారు. అనంతరం అన్ని పోలీస్‌స్టేషన్లలో నమోదైన పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తు చేపట్టిన ప్రతి ఒక్కరు బాధ్యతగా పని చేయాలని తెలిపారు. ఫోక్సో కేసుల్లోని నిందితులకు త్వరితగతిన శిక్షపడేవింగా కృషి చేయాలని సూచించారు. రోడ్డుప్రమాదాల నివారణలో భాగంగా నిత్యం వాహణ తనిఖీలు చేపడుతూ మద్యసేవించి వాహేనాలు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. షీ టీం, భరోసా కేంద్రాల ఆవశ్యకత గురించి అవగాహణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి బాధిత మహిళలకు అండగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరు పాల్వంచం డీఎస్పీలు చంద్రభాను, రెహమాన్, రవీందర్‌రెడ్డి, సతీష్‌కుమార్, మల్లయ్యస్వామి, డీసీఆర్బీ సీఐ శ్రీనివాస్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రమాకాంత్ ఐటీ సెల్ సీఐ నాగరాజు రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎండీ చొరవతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

ఎర్రుపాలెం, మార్చి12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామునూరు సెక్షన్ సబ్‌స్టేషన్ పరిధిలో గల మొలుగుమాడు గ్రామంలో వ్యవసాయ సాగునీరు నిమిత్తం విద్యుత్‌శాఖ సీఎండీ చొరవతో బుధవారం విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. మొలుగుమాడు గ్రామంలో సబ్‌స్టేషన్ ను ఆనుకుని అదే గ్రామానికి చెందిన మాగం కృష్ణ మూడు ఎకరాలలో మిరపసాగు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు ఈనెల 8న అదే సబ్ స్టేషన్ వెనుక నూతనంగా నిర్మిస్తున్న గృహానికి నిర్మాణ నిమిత్తం ఇంటి యజమాని విద్యుత్‌శాఖ అనుమతి లేకుండా విద్యుత్ సరఫరాను నిలిపివేశాడు. పంటకు సాగునీరు అందక రైతు కృష్ణ మోటర్లకు విద్యుత్ సరఫరా అందించాలని అధికారులకు మొరపెట్టుకున్నాడు సంబంధిత విద్యుత్‌శాఖ లైన్‌మన్ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో బాధితుడు 'ఆంధ్రజ్యోతి'ని ఆశ్రయించాడు.

ఫోన్ ద్వారా 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి జోక్యంతో స్పందించిన సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. నాలుగురోజులుగా సరఫరాకు అంతరాయం కలిగినా ఎందుకు స్పందించలేదని సీఎండీ అధికారులను మందలించారు. కాగా మధిర డివిజన్ ఏడీఈ అనురాధ హుటాహుటిన సిబ్బందితో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేసిన 'ఆంధ్రజ్యోతి'కి రైతు కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాజెక్టు దుస్థితిని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు..

తెలపండి: జలగం



ప్రాజెక్టు వద్ద రైతులతో మాట్లాడుతున్న జలగం ప్రసాదరావు

చండ్రుగొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వెంగళరావు సాగర్ ప్రాజెక్టు అలుగును పరిశీలించేదుకు ఈ నెల 17న వస్తున్న జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ప్రాజెక్టు దుస్థితిని వివరించాలని మాజీ మంత్రి జలగం ప్రసాదరావు రైతులకు సూచించారు. మండల పరిధిలోని వెంగళరావు పాజెక్టు అలుగు గత ఐదు సంవత్సరాల క్రితం భారీ వరదలకు ధ్వంసమైంది. ఈ అలుగును మాజీ మంత్రి జలగం బుధవారం పరిశీలించారు. ధ్వంసమైన నాటి నుంచి ప్రాజెక్టులో పూర్తి స్థాయిలో నీరు నిలవటంలేదు. దీంతో ఒక పంట సాగుకే నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అలుగు పునర్నిర్మాణం చేపడతామని కలెక్టర్లు, ఎమ్మెల్యేలు వాగ్దానాలు చేశారు కానీ అమలు కాలేదు. ఈ ప్రాజెక్టుపై అత్యధికంగా ఆదివాసి వర్గానికి చెందిన రైతులు, మత్స్యకారులు ఆధారపడి ఉన్నారు. ఇటీవల మత్స్య సొసైటీ చైర్మన్ ఎస్సీ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతోపాటు స్థానికులు కొందరు ప్రసాదరావు దృష్టికి తీసుకుపోయారు. ప్రాజెక్టుకు తన తండ్రి పేరు ఉండటంతో జలగం సైతం కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో జలగం ప్రాజెక్టును పరిశీలించి 17న కమిషన్ దృష్టికి తీసుకుపోవాల్సిన విషయాలపై స్థానికులతో చర్చించారు.

కృత్రిమ మేధస్సుతో బోధన..

ఉపయోగకరం: పీవో

బూర్గంపాడు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): చదువులో వెనుకబడ్డ విద్యార్థులకు కృత్రిమ మేదస్సుతో విద్యాబోధన చేయడం పిల్లలకు ఎంతో ఉపయోగకరమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. బుధవారం సారపాక గ్రామపంచాయతీలోని గాంధీనగర్ జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కృత్రిమ మేధస్సుతో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్న తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చదువులో వెనుకబడ్డ పిల్లలను గుర్తించి విద్యార్థుల అభ్యాసన మెరుగు పడడానికి, విద్యార్థుల స్థాయిని అంచనా వేయడానికి ఇది ఎంతో ఉపకరిస్తుందని అన్నారు. అభ్యాస కృత్యాలు ప్రతి విద్యార్థికి నిర్వహించడం వలన విద్యాభ్యాసం పట్ల పిల్లలలో మరింత ఉత్సాహం పెంపొందించవచ్చని కఠినమైన పదాలు కాకుండా చిన్న తరగతుల వారికి ఇంగ్లీషులో చిత్రాలు ద్వారా కృత్యాలు నేర్పడం, ఆటలు, నేర్పించాలని అన్నారు. అనంతరం గుట్ట లక్ష్మీపురం గ్రామంలో రైతు లక్ష్మీరెడ్డి సేంద్రియ ఎరువులతో సాగు చేస్తున్న మిరప, పుచ్చకాయ, జామ పంటలను పీవో పరిశీలించారు. పంటలు సాగు చేస్తున్న విదానాన్ని యాజమాన్య పద్ధతుల గురించి రైతును అడిగి తెలుసుకున్న పీవో మాట్లాడుతూ గిరిజన రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందడానికి ఆర్గానిక్ పంటలు వేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చునని అన్నారు. ఎటువంటి హానికరం లేకుండా ఆరోగ్యకరమైన పంటలు పం డిస్తున్న లక్ష్మీరెడ్డిని గిరిజన రైతులు ఆదర్శంగా తీసుకుని సేంద్రియ పంటలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధం



పంతులుతండాలో పూరిల్లు కాలిపోయిన దృశ్యం

జూలూరుపాడు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గ్యాస్‌సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని బేతాళపాడు పంచాయతీ పరిధిలోని పంతులుతండా గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన బాణోత్ రాందాస్ రోజు వారీ గా మిర్చి తోటకు వెళ్లాడు. అతని భార్య సరోజ గ్యాస్ పోయిపై పప్పు పెట్టి స్నా నం చేయటానికి వెళ్లింది. ఈ క్రమంలో గ్యాస్ సిలిండర్ పేలడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి పూరిల్లు పూర్తిగా దగ్ధమైయ్యింది. ఈ అగ్ని ప్రమాదంలో ఇంట్లో ఉన్న రూ.2లక్షల నగదు, కొంత బంగారం, సామగ్రి కాలిపోయ్యాయి.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రికల్ షాపు ...

తిరుమలాయపాలెం, మార్చి12(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఎలక్ట్రికల్ షాపు దగ్ధమైన సంఘటన మండలంలోని కాకరవాయి గ్రామంలో జరిగింది. జూపెడ గ్రామానికి చెందిన బొల్లికొండ రాము కాకరవాయిలో షాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం విద్యుదాఘాతంతో షాపులో మంటలు చెలరేగాయి. దీంతో షాపులోని ప్లాస్టిక్ మెటీరియల్, కూలర్లు, మిక్సీలు, పైపులు ఉండడంతో మంటల తీవ్రత పెరిగింది. మంటలు వ్యాపించకుండా స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. ఫైరింజన్ సిబ్బంది మంటలను అదుపుచేశారు. సుమారు రూ.15లక్షల నష్టం జరిగిందని షాపు నిర్వాహకులు తెలిపారు.

ద్వారకాపూరి కాలనీలో ....

సత్తుపల్లిరూరల్, మార్చి12 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ గ్యాస్ సిలీండర్ నుంచి మంటల అంటుకుని అగ్నిప్రమాదం చోటుచేసుకున్న సంఘటన సత్తుపల్లి పట్టణంలోని ద్వారకాపూరి రోడ్ నెం.4లో బుధవారం చోటుచేసుకుంది. బాధితుడు జరిపేటి వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటికి బంధువులు వచ్చిన నేపథ్యంలో ఇంటిపోర్టికో కింద మహిళలు పిండివంటలు చేస్తున్నారు. గ్యాస్ సిలిండర్ పైపు నుంచి మంటలు వ్యాపించి గ్యాస్ స్టవ్, మంచం మీద నుంచి అనుకుని ఉన్న గదిలోకి ప్రవేశించాయి. మంటలకు గది తలుపులు సైతం పూర్తిగా దగ్ధమవ్వగా కుటుంబ సభ్యులమంతా దూరంగా వెళ్లడంతో ప్రాణప్రాయం తప్పింది. ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా వాహనం తమ ఇంటి వరకు వచ్చేందుకు వీలులేకపోవడంతో నష్టాన్ని నివారించలేకపోయారని, సుమారు రూ.2లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు పేర్కొన్నాడు.

ప్రైజ్‌మనీ పేరిట సైబర్ మోసానికి యత్నం

- ఆన్‌లైన్ షాపింగ్ ద్వారా బహుమతి అంటూ పోస్ట్‌లో కూపన్
- అనుమానంతో ఆరా తీయగా బయటపడిన మోసం



పోస్ట్‌లో వచ్చిన విన్నర్ కూపన్

అశ్వారావుపేట రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): లక్కీ డ్రాలో మీరు రూ.15లక్షల ప్రైజ్‌మనీ గెలుచుకున్నారని బురిడీ కొట్టించేందుకు సైబర్ నేరగాళ్లు యత్నించారు. ఈ సంఘటన అశ్వారావుపేటలో చోటు చేసుకుంది. అశ్వారావుపేటకు చెందిన దినేశ్ పీటర్సన్ అనే వ్యక్తికి పోస్టల్ శాఖ ద్వారా ఆన్‌లైన్ షాపింగ్ యాప్ మీషో 9వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన డ్రాలో రూ.15లక్షల బహుమతిని గెలుచుకున్నారని రిజిస్టర్ పోస్టు వచ్చింది. అందులో ఓస్కాచ్ కార్డు, కంపెనీ నిబంధనలు తెలుపుతూ లెటర్ పంపారు. తనకు వచ్చిన కార్డును స్క్రాచ్‌చేయగా రూ.15,51,000 నగదును గెలుచుకున్నట్లుగా కార్డులో ఉంది. వెరిఫికేషన్ కోసం లెటర్‌లో ఇచ్చిన వాట్సాప్ నెంబర్‌కు స్క్రాచ్ చేసిన కార్డు, లెటర్, విజేత గుర్తింపు కార్డును పంపాలని సూచించారు. నగదును పొందాలంటే పన్నులు చెల్లించాల్సి ఉంటుందని లెటర్‌లో పేర్కొన్నారు. అయితే నిత్యం మీషో ద్వారా రూ.కోట్ల రూపాయల వ్యాపారాలు జరుగుతుండటంతో నిజమేనని నమ్మి వివరాలను వాట్సాప్ ద్వారా పంపగా, తిరిగి సైబర్ నేరగాళ్లు పీటర్సన్‌కు విన్నర్ లెటర్‌ను పంపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.15లక్షల నగదును బ్యాంకులో జమ చేయాలంటే సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.15,510లను చెల్లించాలని, అది చెల్లిస్తేనే నగదు విజేత ఖాతాలోకి వస్తుందని నమ్మబలికారు. అయితే ముందుగా నగదును చెల్లించాలని తెలపడంతో పీటర్సన్‌కు అనుమానం వచ్చి, గూగుల్ ద్వారా మీషో వివరాలను తెలుసుకోగా మీషో పేరిట వచ్చే స్క్రాచ్ కార్డులను, లాటరీ, లక్కీ డ్రాలను నమ్మి మోసవద్దని ఉంది. ఎంతో ప్రాచుర్యం ఉన్న మీషో ఇలాంటి చేయదని కంపెనీ వెబ్‌సైట్‌లో ఉండటంతో తనకు వచ్చిన కార్డు, లెటర్ మొత్తం నకిలీవని నిర్ధారించుకున్నారు. అనుమానించకుండా ఆశతో ఏమాత్రం నగదును బదిలీ చేసినా పిటర్సన్ నిలువునా మోసపోయేవాడు.

దోనాలగుట్ట ఎన్‌కౌంటర్ ప్రాంతం పరిశీలన

కరకగూడెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రఘునాథపాలెం పంచాయతీ మోతె అటవీ ప్రాంతంలోని దోనాలగుట్టలో గత ఏడాది సెప్టెంబరు 5న పోలీసులకు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందగా.. ఇద్దరు గ్రేహౌండ్స్ కానిస్టేబుల్స్‌కు తీవ్ర గాయాలైన దోనాలగుట్ట అటవీ ప్రాంతాన్ని ఎన్ కౌంటర్ జరిగిన ప్రదేశాన్ని బుధవారం భద్రాచలం ఆర్‌డీవో దామోదర్ పరిశీలించారు. ఆర్డీవో దామోదర్ మాట్లాడుతూ మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతాన్ని సైడ్‌లైన్ విచారణ చేయడం జరిగిందని, విచారణకు సంబంధించిన నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణ ప్రసాద్, రఘునాథపాలెం గ్రామస్థులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

చింతకాని, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నేరడ గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు పో లీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్ర కారం... ఈ నెల 8వ తేదీన ఇంటి నుం చి బయటకు వెళ్లిన ఝాన్సీ తిరిగి ఇం టికి రాలేదు. ఆచూకీ కోసం బంధువుల ఇళ్ల వద్ద ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఆమె తల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- ప్రియుడు, అతని స్నేహితుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య
- వివరాలను వెల్లడించిన పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ సతీష్‌కుమార్

పాల్వంచ, మార్చి12 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నేపథ్యంలో జరిగిన హత్యను పోలీసులు ఛేదించారు. బుధవారం పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ కేసు వివరాలను వెల్లడించారు. పుట్టల నరేష్ (33) తన భార్య రజితతో కలసి పాల్వంచ పట్టణ పరిధి పేటచెరువు గ్రామంలో నివసిస్తున్నాడు. అతని భార్య రజితకు వరుసకు బావ అయిన గద్దల సాంబశివరావుతో వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయం తెలుసుకున్న నరేష్ ఆమెను ఇబ్బంది పెట్టసాగాడు. దీంతో వారి అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్న నరేష్‌ను అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే సాంబశివరావు స్నేహితుడైన తాటి నరేష్‌తో కలసి పథ కం వేశారు. అందులో భాగంగా పుట్టల నరేష్ ఫిబ్రవరి 10న సారపాకలో బంధువుల ఇంటికి వెళ్లినపుడు క్రిమిసంహారక మందు కలిపిన మద్యం బాటిల్‌ను సాంబశివరావు తన స్నేహితుడైన తాటి నరేష్ ద్వారా చేరవేశాడు. మద్యం బాటిల్‌ను తనతో పాటు పేటచెరువులోని తన ఇంటికి తీసుకుని వచ్చి రాత్రి సమయంలో అందులో సగం తాగాడు. మరుసటి రోజు ఉదయం వాంతులు చేసుకోవడంతో పుట్టల నరేష్‌ను కుటుంబ సభ్యులు హుటాహుటిన పాల్వంచ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. అది సహజ మరణంగా భావించిన గ్రామస్థులు, కుటుంబ సభ్యులు అతని మృతదేహాన్ని అదే గ్రామంలోని స్మశానంలో పూడ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు.

తరువాత పుట్టల నరేష్ దినసరి కార్యక్రమాల్లో భాగంగా అక్కడకు వచ్చిన ఊరి పెద్దమనిషి బోజ్జా వెంకటేశ్వర్లు పుట్టల నరేష్ తాగగా మిగిలిన మద్యాన్ని తాగాడు. అనంతరం ఆరోగ్యం క్షీణించి ఖమ్మం ఆసుపత్రిలో చికిత్స పొందాడు. దీంతో పుట్టల నరేష్ తల్లి చుక్కమ్మ తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని ఫిబ్రవరి 17న పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు నరేష్ మృతదేహానికి రీ- పోస్టుమార్టం నిర్వహించి విచారణ చేపట్టారు. నరేష్ ఇంట్లో దొరికిన ప్రాథమిక ఆధారాలతో విచారణను వేగవంతం చేసిన పోలీసులు నరే ష్ భార్యను, సాంబశివరావును, అతని స్నేహితుడిని విచారించగా వారు పథకం ప్రకారమే నరేష్‌ను హతమార్చినట్లు నేరం అంగీకరించారు. నిందితులు ముగ్గురినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో పాల్వంచ సీఐ సతీష్, టౌన్ ఎస్ఐ సుమన్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అశ్వారావుపేట రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరోకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రాలోని పోలవరం మండలం శివగిరి గ్రామానికి చెందిన నిర్వాసితులకు మండల సరిహద్దులో ఆంధ్రాలోని రాచన్నగూడెం సమీపంలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఇక్కడ నివాసం ఉండే నడకుదురు గోపిరెడ్డి(36), కె.అర్జున్‌రెడ్డి అనే కొండరెడ్లు మంగళవారం రాత్రి ఆంధ్రాలోని జీలుగుమిల్లిలో జరుగుతున్న జగదాంబతల్లి జాతరకు వెళ్లారు. రాత్రి పదకొండున్నర గంటల సమయంలో ఇద్దరు ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వెళుతున్నారు. ఇదే క్రమంలో అశ్వారావుపేటలోని జంగారెడ్డిగూడెం రోడ్డులో గల కాకతీయ గేట్ సమీపంలో కాకినాడ వైపు వెళుతున్న లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ప్రమాదంలో గోపిరెడ్డి అక్కడిక్కడే మృతి చెందాడు. అర్జున్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు. మృతుడి గోపిరెడ్డి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు...

కొణిజర్ల, మార్చి12(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని శాంతినగర్ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సూరజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దిద్దుపుడి గ్రామానికి చెందిన అమర్లపుడి పుల్లయ్య(55) అనే వ్యక్తి షుగర్ పరీక్ష కోసం ద్విచక్రవాహనంపై వైరాకు బయలుదేరాడు. ఈ క్రమంలో ఆ వ్యక్తి శాంతినగర్ సమీపంలో రోడ్డుదాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. కాగా ఈ ప్రమాదంలో పుల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకోని ఢీకొట్టిన వాహనం గురించి ఆరా తీస్తున్నారు. సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అమర్లపుడి పుల్లయ్య మృతదేహాన్ని సీపీఐ జాతీయసమితి సభ్యుడు భాగం హేమంతరావు, యర్రాబాబు సందర్శించి పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, అంకిని పవన్, మాచర్ల నాగభూషణం, అమర్లపుడి లాజర్, గోపాల్‌రావు, కొత్త వెంకటేశ్వర్లు, దావీదు, అనీల్ పాల్గొన్నారు.

తాటి చెట్టు పై నుంచి పడి గీత కార్మికుడు....



అప్పారావు

ఇల్లెందురూరల్, మార్చి12(ఆంధ్రజ్యోతి): తాటి చెట్టు పై నుంచి జారీ పడి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని ఏడిప్పలగూడెంలో బుధవారం జరిగింది. పోలారం గ్రామానికి చెందిన మోటపోతుల అప్పారావు(42) ప్రతి రోజు లాగే పక్క గ్రామమైన ఏడిప్పలగూడెంలో తాటి చెట్లు ఎక్కి కల్లు గీస్తుండగా చెట్టు నుంచి కిందకు జారీ పడ్డాడు. ఇది గమనించిన స్థానిక రైతులు కింద పడ్డ అప్పారావును కొమరారం పీహెచ్‌సీకి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తాటి చెట్టు మీద నుండి కింద పడి మృతి చెందిన అప్పారావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ సంఘం నాయకులు మోడెం వెంకన్న, శ్రీరాం కోటయ్య ప్రభుత్వాన్ని కోరారు.

విద్యుత్ మోటార్ దొంగల అరెస్టు

మణుగూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మణుగూరు పట్టణ పరిసర ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా ఇండ్లలో ఉన్న విద్యుత్ మోటార్లను ఎత్తుకెళ్తున్న నలుగురు దొంగలను పోలీసులు పట్టుకున్నారు. బుధవారం మణుగూరు సీఐ సతీష్ కుమార్ వివరాలను వెల్లడించారు. మణుగూరులోని ముత్యాలమ్మ నగర్, మద్దులగూడెం, వాగు మల్లారం గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న ఇండ్లలోని బోర్ల మోటార్లను రాయల రాజు (లంకమల్లారం), వాగు మల్లారం చెందిన పుట్టా సందీప్, పోలోజు నర్సింహాచారి కార్పెంటర్, సుతారి మేస్త్రీ పొడుగు ధయాకర్, అపరించే వారని తెలిపారు. వీటిని మంగపేట మండలం రాజుపేటలో, పినపాక మండలం బయ్యారం క్రాస్ రోడ్డులో విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పట్టుకొవడం జరిగిందన్నారు. ఈముఠా వద్ద నుంచి రెండు ద్విచక్రవాహనాలు పలు మోటార్లను సీజ్ చేసి, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

17241 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలు బుధవారం జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా జరిగాయి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గణితం పేపర్ 2ఏ, పొలిటికల్ సైన్స్ 2, బోటని పేపర్ 2 పరీక్ష నిర్వహించారు. మొత్తం జనరల్ విద్యార్థులు 15545 మందికి 15178 మంది పరీక్షలకు హజరుకాగా, 367 మంది గైర్హాజరు, ఒకేషనల్ విద్యార్థులు 2147 మందికి 2063 మంది హాజరుకాగా 84 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరు. మొత్తం 17692 మంది విద్యార్థులకు 17241 మంది విద్యార్థులు పరీక్షకు హజర్రై, 451 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజర్రైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె.రవిబాబు తెలిపారు. 44 పరీక్షా కేంద్రాలను హెచ్‌పీసీ, డీఈసీ, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు తనిఖీ చేశాయి.

నగర సుందరీకరణపై దృష్టి

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరాన్ని సుందీరకరణ దిశగా మార్పులు చేయాలని, ఆధునిక సౌకర్యాలతో మహా నగరాలకు దీటుగా ఖమ్మాన్ని ఉంచాలని మేయర్ పునుకొల్లు నీరజ సమాలోచనలు చేశారు. బుధవారం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో మేయర్ పునుకొల్లు నీరజ సమీక్షించారు. నగరంలో ప్రధాన సమస్యలతో పాటుగా తాగునీటి ఎద్దడికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, డ్రైనేజీ వ్యవస్థ ఇబ్బందులపై మాట్లాడారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో ప్రధాన కూడళ్ల ఆధునీకరణ, ఫుట్‌పాత్‌లు నిర్మాణానికి కావాల్సిన నిధులపై సమీక్షించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిశీలన, కౌంటర్లు ఏర్పాటు, నిధులు జమ వంటి అంశాలను మేయర్‌కు కమిషనర్ వివరించారు. సుడా నిధులు కేటాయింపు, వినియోగంపై సమీక్షించారు. కొన్ని డివిజన్లకు గతంలో మంజూరు చేసిన నిధులు ఇంకా వినియోగించకపోవటంపై మేయర్ దృష్టికి కమిషనర్ తీసుకెళ్లారు. ఎల్ఆర్ఎస్ ద్వారా నిధులు రావటంలో రాష్ట్రంలోనే ఖమ్మం ప్రథమ స్థానంలో నిలిచిందని కమిషనర్ తెలిపారు. ప్రధాన రహదారుల వెంట 50 సెంటీ మీటర్లు వెడల్పుతో గ్రీన్ బెల్ట్ ఏర్పాటుపై మేయర్‌కు కమిషనర్ వివరించారు. హైదరాబాద్ తరహాలో జంతువుల కోసం పెట్ పార్కు నిర్మాణంపై కార్యచరణను కమిషనర్ తెలిపారు. లకారం ట్యాంక్ బండ్‌పై ఆర్వో ప్లాంట్‌తో పాటుగా నగరంలోని పార్కులు అభివృద్ధిపై మాట్లాడారు. ఈనెల 24 లేదా 25 తేదీల్లో ఖమ్మం నగర పాలక సంస్థ బడ్జెట్ సమావేశాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. డివిజన్లలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పథకాలపై మేయర్ పునుకొల్లు నీరజ సూచనలు చేశారు.



డీఆర్ఎఫ్ ఉద్యోగులను అభినందిస్తున్న మేయర్

అందరి కృషితోనే ఖమ్మం అభివృద్ధి: మేయర్

పారిశుద్య కార్మికుల నుంచి ఉన్నత స్థాయిలోని అధికారుల వరకు అందరూ సమష్టిగా పనిచేయటంతోనే మున్నేరు వచ్చిన వరదల విపత్తును కూడా తట్టుకొని నిలబడ్డామని ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. బుధవారం మేయర్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి డీఆర్ఎఫ్ ఉద్యోగులకు నూతన డ్రెస్‌తో పాటుగా హెల్మెట్ కిట్‌లను పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులకు మిల్టన్ వాటర్ బాటిల్స్ పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ మున్నరు వరదల నుంచి సాధారణ రోజుల వరకు కూడా కేఎంసీలోని అన్ని విభాగాల ఉద్యోగులు మంచి పనితీరు కనబరస్తున్నారని అభినందించారు. ఇదే స్ఫూర్తిని రానున్న రోజుల్లోనూ కనబర్చాలని మేయర్ సూచించారు.



మేయర్‌తో సమావేశమైన కమిషనర్ అగస్త్య

సుస్థిర వ్యవసాయం దిశగా రైతులను ప్రోత్సహించాలి

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో దశల వారీగా పురుగుల మందులను తగ్గిస్తూ సేంద్రియా ఏరువుల వినియోగాన్ని పెంచుతూ సుస్థిర వ్యవసాయం దిశగా రైతులను ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య పేర్కొన్నారు. బుధవారం రఘునాథపాలెం మండలం వీ వెంకటాయపాలెం రైతు వేదికలో డిప్లమో ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఫర్ ఇన్పుట్ డీలర్స్(దేశి) కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విత్తన, ఎరువులు, పురుగుల మందు డీలర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో రైతులకు మంచి సేవలు అందించాలని కోరారు. నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులు దిగుబడిలో రావటంలో విత్తన కంపెనీలు బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సుస్థిర వ్యవసాయం అందించటంలో ఎరువులు, పురుగుల మందుల వ్యాపారులు కీలకంగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ అభిమన్యుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధనసరి పుల్లయ్య

తాగునీటి ఎద్దడి లేకుండా కార్యాచరణ

48వ డివిజన్‌లో పర్యటించిన తుమ్మల యుగంధర్



కార్యక్రమంలో పాల్గొన్న తుమ్మల యుగంధర్

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో పెరుగుతున్న జనాభాకు తగిన స్థాయిలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సౌకర్యాలు పెంపొదిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ పేర్కొన్నారు. బుధవారం 48వ డివిజన్‌లో ఆయన పర్యటించారు. స్థానిక రామాలయంలో కాంగ్రెస్ నాయకులు అల్లే సాయికిరణ్ సొంత ఖర్చులతో నిర్మాణం చేపట్టిన బోరు బావిని యుగందర్ ప్రారంభించారు. స్థానిక కార్పొరేటర్ కన్నం వైష్ణవిప్రసన్నకృష్ణ, మాజీ కౌన్సిలర్ సింగం అంజయ్య, డివిజన్ అధ్యక్షులు షేక్ రజ్జీ, నాయకులు నాళం సతీష్, చేతి కృష్ణ, రాంసింగ్, సదాశివరావు, లక్ష్మణ్, లింగస్వామి, మరాఠీ రమేశ్ పాల్గొన్నారు.

ఘనంగా మహాగణపతి హోమం

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని 10వ డివిజన్ చైతన్య నగర్‌లో నూతనంగా నిర్మించిన ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం కేరళ నుంచి విచ్చేసిన తంత్రి తక్కే కోరమంగళం దామోదరన్ నంబూత్రి, పాతికల్లం నారాయణన్ నంబూత్రి ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా బుధవారం మహా గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు హనుమంతరావు, పదవ డివిజన్ కార్పొరేటర్ చావా మాధురి నారాయణరావు, షల్లం రాజు, 11వ డివిజన్ కార్పొరేటర్ సరిపూడి రమా సతీష్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రబీ రైతులకు అందుబాటులో పట్టాలు

నేలకొండపల్లి, మార్చి12(ఆంధ్రజ్యోతి): రానున్న రబీలో ధాన్యంపై కప్పుకోవటానికి అవసరమైన పట్టాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని ఏఎంసీ ఛైర్మన్ వెన్నపూసల సీతారాములు చెప్పారు. బుధవారం సాయంత్రం ఏఎంసీ కార్యాలయంలో జరిగిన కమిటీ డైరెక్టర్ల సమావేశంలో వెన్నపూసల మాట్లాడారు. రబీలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయటానికి వీలైనన్ని ఎక్కువగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేలా మంత్రి శ్రీనివాసరెడ్డితో మాట్లాడి ఏర్పాటు చేయిస్తానన్నారు. రైతులు మార్కెట్ కార్యాలయానికి ఎప్పుడు వచ్చినా సేవలు అందించటానికి సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. మార్కెట్ పరిధిలో పరిష్కరించగలిగే సమస్యలను పరిష్కరించటానికి అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటామన్నారు.

తొలుత కార్యదర్శి నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కొండపర్తి సురేష్, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి అజ్మీరా పంతులు, గ్రేడ్-3కార్యదర్శి నాగేశ్వరి, డైరెక్టర్లు చిట్టూరి అచ్చయ్య, మీసా నాగేశ్వరరావు, సైదానాయక్, తిప్పని సరోజిని, సత్యనారాయణ, ఏడీఏ సరిత, ఏవో రాధ తదితరులు పాల్గొన్నారు.

మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన.. నీటిపారుదల శాఖ సలహాదారుడు



ఖమ్మం కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు పెంటారెడ్డి బుధవారం ఖమ్మం ఖమ్మం జిల్లాలో పర్యటించారు. రఘునాథపాలెం మండలం మంచుకొండ గ్రామం వద్ద ఎత్తిపోతల పథకం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పథకానికి వినియోగిస్తున్న సామాగ్రి పంపులు మోటార్లు పైపులైన్ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. పనులలో ఎక్కడ రాజీ పడకుండా నిర్వహించాలని సూచించారు. పథకం ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలు తదిత అంశాలపై ఆయన అధికారులతో కలిసి సమీక్షించారు. అంతకుముందు ఆయన ఎత్తిపోతల నిర్మాణ ప్రదేశాన్ని దానికి వినియోగిస్తున్న వినియోగిస్తున్నటు వంటి సామాగ్రిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఈఈలు మంగళ పూడి వెంకటేశ్వర్లు, అణనీయ, ఝాన్సీ, శ్రీ చరణ్, రాజీవ్ పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ పరిధిలోకి..

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇందిరానగర్ కాలనీలోగల బాలగణపతి సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయాన్ని బుధవారం దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకోవటం జరిగిందని దేవాదాయ ధర్మాదాయ సహాయ కమిషనర్ వీరస్వామి తెలిపారు. ఆలయ నిర్వాహణ విషయంలో, ఆదాయం పక్కదోవ పట్టిస్తున్నట్లుగా కలెక్టర్‌కు వచ్చిన ఫిర్యాదుపై విచారణలో భాగంగా దేవాదాయ అధికారులు ఆలయాన్ని సందర్శించగా ఆలయ అర్చకుడు, కమిటి వారు స్వచ్ఛంద సహకారంతో బుధవారం ఆలయంను స్వాధీన పరుచుకోని హుండిని తెరచి లెక్కించినట్లు తెలిపారు. హుండీలో రూ.34,173ల ఆదాయం ఉండటంతో ఆ ఆదాయాన్ని తీసి దేవస్థానం పేరున బ్యాంక్ ఖాతా తెరచి జమచేయటం జరిగిందని తెలిపారు. ఈ ఆలయం 2008కి పూర్వం అదే ప్రాంతంలో రాగి చెట్టు కింద చిన్న గుడిగా ఉండేది, 2008లో పున:నిర్మాణంలో భాగంగా నూతన ఆలయాన్ని నిర్మించారు. ఆ రోజు నుంచి భక్తుల విరాళాలతో ఆలయ కమిటి ఆధ్వర్యంలో ఉత్సవాలు, ఆలయ నిర్వాహణ జరిగేది. కాగా గత కొతకాలంగా ఆలయంలో అవకతవకలు జరుగుతన్నాయని పలువురు భక్తులు కలెక్టర్‌కు, దేవాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదులు చేయటంతో కలెక్టర్ ఆదేశాలతో ఆలయాన్ని దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకోవటం జరిగిందని సహాయ కమిషనర్ వీరస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఈవోలు కె జగన్‌మోహన్‌రావు, వీవీ నరసింహారావు, కె.శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసుల ఎఫెక్ట్

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య మంచితనంతో రోజు వారీగా రెవెన్యూ సిబ్బందితో రివ్యూలు నిర్వహించి ఖమ్మం నగరంలో ట్యాక్స్ కలెక్షన్ ఆదాయ వసూళ్లు చేపట్టాలని పదే పదే చెప్పినా పెద్దగా ప్రయోజనం లేకుండా పోయింది. 25 మంది బిల్ కలెక్టర్లు 14 మంది వార్డు ఆఫీసర్లు, మరో 16 మంది ఇతర ఉద్యోగులను ఆదాయ వసూళ్లకు కేటాయించారు. కాని రోజు వారీగా కేవలం రూ.12 లక్షల నుంచి రూ.13 లక్షల మేరకు మాత్రమే వసూళ్లు జరుగుతున్నాయి. గతేడాది కేఎంసీ రూ.30.80 కోట్లు ఆదాయ వసూళ్లు జరిగాయి. ఈ సంవత్సరం మాత్రం గతేడాది కంటే అధికంగా ఆదాయ వసూళ్ల లక్ష్యాన్ని కమిషనర్ అభిషేక్ అగస్త్య నిర్ణయించారు. మార్చి చివరి వరకు ఆదాయ వసూళ్ల లక్ష్యం రూ.32 కోట్లు లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ఇప్పటి వరకు రూ.24 కోట్లు ఆదాయం వచ్చింది. మరో రూ.8కోట్లు ఆదాయ వసూళ్లు కావాల్సి ఉంది.

రూ.25 లక్షల ఆదాయం..

మార్చి చివరి తుది గడువు సమీపిస్తున్నా ఆదాయ వసూళ్లలో కొంతమంది ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో రోజుకు రూ.12 లక్షల నుంచి రూ.13 లక్షల వరకు వసూళ్లు జరిగాయి. దీంతో మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన కమిషనర్ అభిషేక్ అగస్త్య ఐదుగురు బిల్ కలెక్టర్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీంతో ఆదాయ వసూళ్లు చేసే ఉద్యోగులు ఒక్కసారిగా ఉలిక్కిపాటుకు గురైనారు. బుధవారం అనూహ్యంగా రూ.25 లక్షల ఆదాయ వసూళ్లు చేశారు.



ఆదాయ పన్ను వసూలు చేస్తున్న అధికారులు

ఐదుగురు ప్రత్యేక అధికారులు

ఆదాయ చెల్లింపులు ఇవ్వని వారి ఆస్తులను, భవనాలను సీజ్ చేసేందుకు కమిషనర్ అభిషేక్ అగస్త్య ఐదుగురు ప్రత్యేక అధికారులను నియామకం చేశారు. ఇంజనీరింగ్ పర్యవేక్షణా అధికారి కృష్ణలాల్, డీఈలు ధరణికుమార్, టీ శ్రీనివాసులు, ఏఈలు బాబు, కుమారస్వామిలను నియామకం చేశారు. ప్రతి ఐదుగురు బిల్ కలెక్టర్‌లకు ఒక ప్రత్యేక అధికారిని కేటాయించారు. మార్చి చివరి నాటికి కేఎంసీ ఆదాయ వసూళ్ల లక్ష్యం పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

ఖమ్మం రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థీ పదవ తరగతి నుండే భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు సురేష్ నాయక్ విద్యార్థులకు సూచించారు. మండల పరిధిలోని ఏదులాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవతరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, మెటీరియల్స్‌ను సురేష్ నాయక్ తన సొంత ఖర్చులతో అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతు విద్యార్థులు మంచి మార్కులు తెచ్చుకుని తల్లిదండ్రులకు, పుట్టిన గ్రామానికి, చదివిన పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పదిలో ఉత్తమ ఫలితాలు సాధించి ఏదులాపురం పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివకుమారి, ఆత్మకమిటి డైరెక్టర్ ప్రద్యుమ్న చారి, శేష్ రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నేలకొండపల్లి, మార్చి12 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం చలివేంద్రాన్ని ఎంపీడీవో మర్రి యర్రయ్య ప్రారంభించారు. అందరికీ తాగు నీటిని అందచేసారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ రోజురోజుకు ఎండలు పెరుగుతున్నాయన్నారు. ఎండల్లో వివిధ పనుల కోసం మండల కార్యాలయానికి వచ్చే వారు త్రాగు నీటికి ఇబ్బందులు పడకుండా కార్యాలయ ఆవరణలోనే చలివేంద్రాన్ని ప్రారంభించామని ఎంపీడీఓ మర్రి యర్రయ్య చెప్పారు. కార్యక్రమంలో నేలకొండపల్లి కార్యదర్శి శ్రీనివాసరావు, ఎంపీడీఓ కార్యాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పండితాపురం సంత వేలం పాట

కామేపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కామేపల్లి మండల పరిధిలోని పండితాపురంలోని శ్రీ క్రిష్ణ ప్రసాద్ పశువుల సంత వేలం పాట మార్చి 13న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రవీందర్, పంచాయతీ కార్యదర్శి శంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. కొమ్మినేపల్లి పంచాయతీ పరిధిలోని షెడ్యూల్డ్ తెగలు చెందిన గ్రామస్థులు ఈ వేలం పాటలో పాల్గొనవచ్చని అన్నారు. దారావత్తు సొమ్ము కింద రూ.30లక్షలు, సాల్వెన్సీ సొమ్ము రూ5లక్షలు డీడీ లేదా నగదు రూపంలో చెల్లించి పాల్గొనాలని సూచించారు.

31 వరకు గడువు పొడిగింపు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకం రెండో దశ దరఖాస్తుల గడువు ఈ నెల 31 వరకు పొడిగించటం జరిగిందని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి టి.సీతారాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ ఐటిఐ, పాలిటెక్నిక్ డిప్లోమా ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు నెలవారి భత్యం రూ.5వేలు, ఒకేసారి రూ. 6వేలు మంజూరు చేయబడతాయని తెలిపారు. 12 నెలల శిక్షణా కాలంలో కనీసం 6నెలలు ఉద్యోగ శిక్షణ ఉంటుందని తెలిపారు.

జీపీఎఫ్ సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఉద్యోగ ఉన్నతిపై ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుల, ఉపాధ్యాయుల జీపీఎఫ్ నిధులను వారి ఖాతాల్లో వడ్డీతో సహా జమ చేయాలని బుధవారం జడ్పీ సీఈవో దీక్షా రైనాను పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం జడ్పీ డిప్యూటీ సీఈఓ నాగ పద్మజను కలిసి సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శేఖర్ రావు, వెంకన్న పాల్గొన్నారు.

మేలుకో తెలుగును ఆదుకో

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మేలుకో తెలుగును ఆదుకో, తెలుగు భాష అద్భుతమైన జీవద్భాష, సరళంగా, ఒత్తులేకుండ రాయటానికి ఆస్కారమున్నదని భాషా పరిశోధకులు, తెలుగు ఉపాధ్యాయుడు చంద్రగిరి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు లిపి సరళత ఒత్తుల్లేకుండ ఒత్తిడి లేకుండా తెలుగు రాయటం అనే అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో విద్యార్థులకు అవగాహన కల్పించారు. భాషలో లిపి మారుతున్న క్రమంలో అంతర్గతంగా ఒత్తులు వల్లనే భాస కష్టతరంగా మారుతున్నదని అన్నారు. ఒత్తులకు స్థానలోపం కారణంగానే భాషకు సంక్లిష్టత ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లా, వైస్ ప్రిన్సిపాల్ శాస్త్రీ, అధ్యాపకులు పి.రవికుమార్, సీనియర్ అధ్యాపకులు సీతారాం, అనురాధ, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ నిరసన దీక్షలు

రఘునాథపాలెం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): 30ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం ఎంఆర్‌పీఎస్ పోరాటాలు చేస్తూ ఎంతమంది మాదిగలు అమరులైనారని కానీ ఎస్సీ వర్గీకరణ కాలేదని అందుకే తహసిల్దారు కార్యాలయాల ఎదుట నిరసన దీక్షలు చేపట్టినట్లు ఎంఎస్‌పీ మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షులు తూరుగంటి అంజయ్య ఆరోపించారు. బుధవారం రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన దీక్షలను ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన దీక్షాల్లో గాజుల నర్సింహారావు, మంద గోపాలరావు, కంచర్ల మోహన్, మంద ప్రభాకర్, దాసరి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకురాలికి నివాళులు

తిరుమలాయపాలెం, మార్చి12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడిదపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకురాలు బండ్ల లచ్చమ్మకు బుధవారం పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి నివాళులర్పించారు ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందగా బుధవారం దశదినకర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా లచ్చమ్మ చిత్రపటానికి ఆయన పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరన్న, నాయకులు లచ్చిరెడ్డి, బానోతు రవి, బండ్ల సురేష్ పాల్గొన్నారు.

బచ్చోడులో రాస్తారోకో



రాస్తారోకో నిర్వహిస్తున్న దృశ్యం

తిరుమలాయపాలెం, మార్చి12 (ఆంధ్రజ్యోతి): బచ్చోడును మండల కేంద్రం చేయాలని కోరుతూ బుధవారం అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా అఖిలపక్షనేతలు తిమ్మిడి హనుమంతరావు, జక్కుల యాదగిరి, నిమ్మల నర్సిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మంత్రులు బచ్చోడును మండల కేంద్రంగా ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారని, ఆహామిని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో యలమంచి, వెంకటరమణ, రమేష్, యాదగిరి పాల్గొన్నారు.

స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి

» రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు

మధిర రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలుచేయాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు కోరారు. బుధవారం మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి సీపీఐ కార్యాలయంలో జరిగిన రైతు సంఘం మూడో మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండవీటి గోవిందరావు, నాయకులు బెజవాడ రవిబాబు, మందడపు రాణి, పుట్ట కొండలరావు, ఎం.ఏ.రహీం, పెరు మాళ్లపల్లి ప్రకాశరావు తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి రాయల, పువ్వాళ్ల పరామర్శ

ముదిగొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలంలోని వల్లభి మాజీ ఎంపీటీసీ విప్పర్తి ఎల్లయ్య మాతృమూర్తి జజారమ్మ ఇటీవల మృతిచెందగా ఆమె దశదిన కర్మలు బుధవారం జరిగాయి. మున్నేరు గడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వీరభద్రం, బస్సార్, పుల్లారెడ్డి, నాగార్జున, రామవ, ఉపేందర్ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

వేంసూరు, మార్చి 12: వేంసూరు మండలం కందుకూరులోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణాన్ని బుధవారం రాత్రి 9.15గంటలకు అర్చకులు ఎంవీగోపాలాచార్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. శ్రీపద్మావతి, శ్రీఅలివేలు మంగమ్మవార్ల సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఆలయ ఈవో వీవీఎల్‌వెంకట్రావ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.



వేంసూరులో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు


కారేపల్లిలో ముస్తాబైన వేంకటేశ్వరస్వామి ఆలయం

నేడు ఎడ్లబండ లాగుడు పోటీలు

శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలను పురస్కరించుకొని గురువారం జాతీయస్థాయి ఒంగోలుజాతి ఎడ్లబండ లాగుడు పోటీలను ప్రారంభించనున్నారు. ఈ పోటీలకు సంబంధించి గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. గురువారం కేటగిరి, శుక్రవారం జూనియర్స్, శనివారం సీనియర్స్ విభాగాల్లో ఎడ్లబండ లాగుడు పోటీలు జరుగనున్నాయి.

కారేపల్లిలో నేడు శ్రీవారి కల్యాణం

కారేపల్లి, మార్చి12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో నేడు గురువారం పద్మావతి సహిత వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకలకు ఆలయాన్ని నిర్వాహకులు అంగరంగ వైభవంగా తీర్చిదిద్దారు. స్వామి వారి కల్యాణం గురువారం మధ్యాహ్నం జరుగుతుందని ఆలయనిర్వాహకులు నల్లమోతుల శేషయ్య అన్నారు.

మునిసిపాలిటీలో సమస్యలు పరిష్కరించాలని ధర్నా


మునిసిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

వైరా, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీలో భారీగా పెంచిన పన్నుల భారాన్ని తగ్గించాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం మునిసిపల్ కార్యాలయం ముందు మహాధర్నా నిర్వహించారు. కేరళ తరహాలో ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని, ఇంటి పన్ను ఆస్తిపన్ను భారాలు తగ్గించాలని, ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, జర్నలిస్టులకు ఇండ్లస్థలాల కోసం ఎస్సెస్ట్ కాష్ట్ స్థలాన్ని కేటాయించాలని, ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేయాలని కోరుతూ భారీగా తరలివచ్చిన జనంతో మహాధర్నా నిర్వహించారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ చింతా వేణుకు వినతిపత్రాన్ని సీపీఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం అందజేశారు. ఆపార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు, పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, నాయకులు తాళ్లపల్లి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు, మచ్చా మణి, తోట నాగేశ్వరరావు, తూము సుధాకర్, బొంతు సమత, చెరుకుమల్లి కుటుంబరావు, బాణాల శ్రీనివాసరావు, కొంగర సుధాకర్, రజిత, మోహన్‌రావు పాల్గొన్నారు.

వందశాతం ఫలితాలు సాధించాలి

బోనకల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్, పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తహసీల్దార్ పున్నం చందర్, ఎంఈవో దామాల పుల్లయ్యలు సూచించారు. బోనకల్‌లోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం వారు సందర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి వితరణ

కొణిజర్ల, మార్చి12(ఆంధ్రజ్యోతి): చేతనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని తనికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రిని వితరణ చేశారు. వాటిని పాఠశాల ఇన్‌ఛార్జ్ దొండపాటి శ్రీనివాస్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చేతనా ఫౌండేషన్ బాధ్యులు దొడ్డా సీతారామయ్య, నవీన్, రషీద్, రామ్మోహన్‌రావు, ఉపాధ్యాయులు సురేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'కుటుంబ సర్వే బకాయిలను చెల్లించాలి'

చింతకాని, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కుటుంబ సర్వే విధుల్లో పాల్గొన్న సిబ్బందికి, ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కూరపాటి అనంతరాజుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణ, తోటకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రూప్-2 ర్యాంకర్‌కు సన్మానం

తల్లాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 ఫలితాల్లో ప్రతిభను చాటుకున్న మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన దుగ్గిదేవర వెంకటేశ్వరరావును బుధవారం బీజేపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో బీ జేపీ నాయకులు ఆవిటి వెంకటరామారావు, గా డె కృష్ణారావు, వాడపల్లి నాగేశ్వరరావు, పెరిక కిరణ్, చల్లా నరేష్, సుధాకర్ పాల్గొన్నారు.

జేఎల్‌గా ఉద్యోగం సాధించిన దాచాపురం యువకుడు

వైరా, మార్చి 12 (ఆం ధ్రజ్యోతి): మండలంలోని దాచాపురం గ్రామానికి చెందిన అయిలూరి బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ ఉద్యోగాన్ని సాధించారు. ఇటీవల హైదరాబాద్ రవీంద్రభారతిలో జూనియర్ లెక్చరర్ల నియామక పత్రాన్ని తీసుకున్నారు. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట ప్ర భుత్వ జూనియర్ కళాశాలలో హిస్టరీ లెక్చరర్‌గా పోస్టింగ్ లభించింది. అయిలూరి శ్రీనివాసరెడ్డి, పద్మావతి దంపతుల మొదటి సంతానం బ్రహ్మానందరెడ్డి. 1నుంచి ఇంటర్మీడియేట్ వరకు వైరాలోని రాఘవ విద్యానికేతన్, డిగ్రీ ఖమ్మంలోని సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో, పీజీ సికింద్రాబాద్‌లోని పీజీ కాలేజీలో హిస్టరీ చదివాడు. అతర్వాత అరుసార్లు నెట్ పరీక్షలు రాసినా ఉద్యోగం వరించలేదు. ఇటీవల జరిగిన గ్రూప్-1 పరీక్ష రాశాడు. చివరికి జూనియర్ కాలేజీ లెక్చరర్ పోస్టును సాధించాడు.


బ్రహ్మానందరెడ్డి

భట్టి కృషితోనే మెరుగైన రవాణా సౌకర్యాలు

మధిరటౌన్, మార్చి12(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం భట్టి కృషితోనే మధిర మండలంలో పలు గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు ఏర్పడుతున్నాయని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ అన్నారు. బుధవారం ఆత్కూరు నుంచి మధిర, మధిర నుంచి మాటూరుకు నిర్మిస్తున్న బీటీ రోడ్డును వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దారా బాలరాజు, సత్యానందం తదితరులున్నారు.

గురుకులాల మరమ్మతులకు నిధుల కేటాయింపు పట్ల హర్షం

వైరా, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల మరమ్మతుల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించడం పట్ల టీఎస్ వారియర్స్ జిల్లా అధ్యక్షుడు నారపోగు ఉదయ్, ప్రధాన కార్యదర్శి వృద్ధిరాజ్, కోశాధికారి బీ వెంకటేష్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న 8బాలికలు, బాలుర సాంఘిక సంక్షేమ గురుకులాల శాశ్వత భవనాల మరమ్మతుల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. నాణ్యతతో సకాలంలో పూర్తిచేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

అధిక సాంద్రత పద్ధతిలో దిగుబడులు



సమావేశంలో మాట్లాడుతున్న వీరన్న

వైరా, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుచేయటం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చునని పత్తి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వీరన్న పేర్కొన్నారు. వైరాలోని ఖమ్మంజిల్లా కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై కిసాన్‌మేళా నిర్వహించారు. వరిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వెంకన్న, సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై డాక్టర్ ఓంప్రకాశ్, ఆవాలపై ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.రుక్మిణిదేవి రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా ఉద్యాన వనశాఖ అధికారి మధుసూదన్, పశువైద్యశాఖ ఏడీఏ రామజీ, ప్రొఫెసర్ బి.శ్రీనివాసరెడ్డి, మధిర ఏడీఏ విజయ్‌చంద్ర, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్, శాస్త్రవేత్తలు డాక్టర్ వి.చైతన్య, పశుశ్రీ, విస్తరణ సలహా సంఘం మెంబర్ తుమ్మల రాజాప్రతాప్ పాల్గొన్నారు.

లక్కినేని కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి తుమ్మల

కల్లూరు, మార్చి12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరా వు బుధవారం కల్లూరులో ఆడిషనల్ కలెక్టర్ (నిర్మల్‌జిల్లా) లక్కినేని కిషోర్ కుటుంబాన్ని పరామర్శించారు. కిషోర్ మాతృమూర్తి లక్కినేని శాంతమ్మ దశదిన కార్యక్రమం సందర్భంగా వారి కుమారులైన ఎల్‌వీ ప్రసాద్, కిషోర్‌లను కలిశారు. ఈ సందర్భంగా శాంతమ్మ చిత్రపటానికి మంత్రి తుమ్మల పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి సంతాపం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, నిర్మల్, వైరాస, కల్లూరు ఆర్డీవోలు కోమలిరెడ్డి, రత్నకళ్యాణి, ఎల్ రాజేంద్రగౌడ్, పోలవరం ఏసీపీ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు నున్నా రామకృష్ణ, పసుమర్తి చందర్‌రావు, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజదేవి, బీఆర్ఎస్ నాయకుడు లక్కినేని రఘు, ప్రతిభ విద్యాసంస్థల అధినేత లక్కినేని ప్రసాద్ తదితరులు శాంతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పెద్ది ప్రియదర్శిని, కె ప్రత్యూష, సుజేంద్ర సింహ, అచ్యుత కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


శాంతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల

శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పొందాలి

సత్తుపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పొందాలంటే క్రీడల్లో పాల్గొనాలని కల్లూరు ఏసీపీ ఏ.రఘు అన్నారు. మండలంలోని కొత్తూరులోని మదర్‌తెరిస్సా ఆటానమస్ ఇంజనీరింగ్ కళాశాల 24వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం కళాశాల ఆవరణలో క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ టీకిరణ్, ఎస్ఐ టీకవిత, ప్రిన్సిపాల్ డా.చలసాని హిమకృష్ణ, సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, వైస్ చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ కొత్తూరు ప్రభాకరరావు, డైరెక్టర్ కొత్తూరు సత్యనారాయణ, అకడమిక్ డైరెక్టర్ డా.వి.శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ డీన్ డా.జాకీర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మాలతి మృతి ఉద్యమాలకు తీరని లోటు

కొణిజర్ల, మార్చి12(ఆంధ్రజ్యోతి): మాలతి ఆకాల మరణం విప్లవ సాంస్కృతిక ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని సీపీఐ ఎంఎల్(న్యూడెమోక్రసీ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆవునూరి మధు, వెంకటేశ్వరరావు, పీవోడబ్ల్యూ జాతీయ నాయకురాలు ఝాన్సీ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు కొనియాడారు. మండల పరిధిలోని రామనర్సయ్యనగర్ గ్రామానికి చెందిన బానోతు మాలతి(50) అనారోగ్యంతో మరణించింది. బుధవారం గ్రామంలో ఆమె అంతిమయాత్ర నిర్వహించారు. న్యూడెమోక్రసీ పార్టీ వైరా సబ్‌డివిజన్ కార్యదర్శి షేక్ బాసీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు నాగన్న, లక్ష్మ, రాజేంద్రప్రసాద్, విప్లవకుమార్, గిరి, కోల లక్ష్మీనారాయణ, ఆర్వసోరావు, లాల్‌మియా, బాషా, పఠాన్‌జానీఖాన్, శంకర్, బాబు, లచ్చన్న పాల్గొన్నారు.

మిడ్డేమీల్స్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

వైరా, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్నభోజన వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ నాయకుడు పమ్మి అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకుడు సుంకర సుధాకర్, అనుమోలు రామారావు, వర్కర్లు ప్రమీల, త్రివేణి, కరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం: సీపీఎం

కొణిజర్ల, మార్చి12(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని ఆ పార్టీ జిల్లా నాయకుడు తాళ్లపల్లి కృష్ణ, మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు తెలిపారు. మండల పరిధిలోని తనికెళ్లలో బుధవారం జరిగిన ఆ పార్టీ గ్రామశాఖ మహాసభలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చింతనిప్పు సూరయ్య, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ రంజాన్, చల్లా నారాయణ, యాసా ప్రభాకర్, వేములు సాంబ, యాసా లిలక్, సొసైటీ ప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భద్రాద్రి బ్యాంకు శాఖ ప్రారంభం


కల్లూరులో భద్రాద్రి బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న బ్యాంకు చైర్మన్ కృష్ణమూర్తి

కల్లూరు, మార్చి12 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన భద్రాద్రి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు శాఖను ఆ బ్యాంకు చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ కృష్ణమూర్తి ప్రసంగిస్తూ తమ బ్యాంకు రూ.930 కోట్లతో వ్యాపారం సాగిస్తుందన్నారు. బ్యాంకు తరఫున గృహ, వ్యాపార, విద్య, చిన్నతరహా పరిశ్రమలు, బిరువ్యాపారులకు తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తుందన్నారు. బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని ప్రజలను కోరారు. ఉమ్మడిజిల్లా సంఘం జిల్లా చైర్మన్ పసుమర్తి చందర్‌రావు మాట్లాడుతూ ప్రైవేట్ రంగంలో ఉన్న సహకార బ్యాంకులు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కల్లూరు రైసుమిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు చెన్నంశెట్టి అచ్యుత సీతారామారావు, సీఈవో దాసరి వేణుగోపాల్, వైస్ చైర్మన్ మద్ది పిచ్చయ్య, డైరెక్టర్లు డి. రాజారావు, వేములపల్లి వెంకటేశ్వరరావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

సత్తుపల్లిరూరల్, మార్చి12 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి ఇరువురిని ఢీకొన్న సంఘటన సత్తుపల్లి పట్టణంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఖమ్మం వైపు నుంచి కిష్టారానికి చెందిన గుర్రం వెంకటేశ్వరరావు పూటుగా మద్యం సేవించి బజాజ్ పల్సర్ బైక్‌పై అతివేగంగా వస్తున్నాడు. అదే సమయంలో జవహర్‌నగర్‌కు చెందిన చప్పిడి హేమంత్, పెండ్ర వెంకన్నలు ఇంటినుంచి బైక్ కొనుగోలు నిమిత్తం సెంటర్‌కు వచ్చారు. స్థానిక హోప్ స్వచ్ఛంద భోజనహోటల్ వాహనాలను ఢీకొట్టి ఎదురుగా ఉన్న నడుచుకుంటూ వస్తున్న ముగ్గురు వ్యక్తులను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో హేమంత్‌కు, బైక్‌తో ఢీకొట్టిన వెంకటేశ్వరరావుకు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇరువురి పరిస్థితి విషమంగా ఉండగా మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించినట్లు వైద్యులు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. ప్రమాద సమయంలో బైకిస్ట్ ఢీకొట్టిన వ్యక్తి ద్విచక్ర వాహనంలో ఫుల్‌బాటిల్ మద్యం సేవించి ఉండగా అతివేగంతో పాటు మద్యం సేవించి ఉండటమే కారణమని తెలుస్తోంది.

సత్తుపల్లిరూరల్, మార్చి12 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్న సంఘటన సత్తుపల్లి పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంటకు చెందిన అగ్గి రవి అనే ఉపాధ్యాయుడు సత్తుపల్లి నుంచి కిష్టారం వైపు ద్విచక్ర వాహనం వెళ్తున్నాడు. స్థానిక వెంగళరావు నగర్ శివాలయం వద్దకు వెళ్లగానే ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనగా ప్రయివేట్ అంబులెన్స్‌లో సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు.

తాళ్లమడలో...

ఆంధ్రాలోని చింతలపూడి మండలం రాఘవాపురంకు చెందిన పొన్నమనేని వెంకటేశ్వరరావు సత్తుపల్లి నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. అయితే మండలంలోని తాళ్లమడ సెంటర్‌లోని వాటర్ ట్యాంక్ వద్ద ఓ లారీ పంక్చర్ నిమిత్తం నిలిపి ఉంది. ఆ సమయంలో వెనుక నుంచి టీవీఎస్ మోపెడ్‌పై వస్తున్న ఓ వ్యక్తి ఢీకొనడంతో అదుపుతప్పిన వెంకటేశ్వరరావు బైక్‌తో సహా అగి ఉన్న లారీ కిందకు వెళ్లగా తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పలు కుటుంబాలకు మువ్వా పరామర్శ

కల్లూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ మువ్వా విజయబాబు బుధవారం పలు కుటుంబాలను పరామర్శించారు. ఇటీవల ప్రమాదంలో తీవ్ర గాయాలైన కాంగ్రెస్ నాయకుడు లక్కినేని కిషోర్ వరామర్శించారు. వంట మేస్త్రీ వహీద్ కుటుంబాన్ని పరామర్శించారు. ప్రముఖ వైద్యుడు పి రాధాకృష్ణమూర్తి నివాస గృహానికి వెళ్లి వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మట్టూరి జనార్దన్, జిల్లా టెలికం డైరెక్టర్ యాసా వెంకటేశ్వరరావు, గోపాల్, రవి, శ్రీను, అఫ్రోజ్ తదితరులు ఉన్నారు.

శ్మశానవాటికలో సౌకర్యాలు కల్పించాలని వినతి


కారేపల్లి, మార్చి12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హిందూ శ్మశానవాటిలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ బుధవారం మండల బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా నాయకుడు తురక నారాయణ మాట్లాడారు. తహసీల్దార్ ఎన్.సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు పాల్గొన్నారు.

ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

కల్లూరు, మార్చి12 (ఆంధ్రజ్యోతి): స్థానిక గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు, ఆషా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ మట్టా దయానంద్ ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఆర్డీఓ రాజేంద్రగౌడ్ తదితరులు ఉన్నారు.

వర్గీకరణపై ఇచ్చిన మాటను సీఎం నిలబెట్టుకోవాలి

» ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు


బోనకల్‌లో దీక్షలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బోనకల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు తరువాతే ఉద్యోగ నియామకాలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బిలక నాగరాజు, ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట హనుమంతరావులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న రిలే దీక్షలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తాటికొండ వెంకటరత్నం, చిన సైదులు, బలంతంత్ర నర్సింహారావు, మద్దికుంట గంగాధర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

వైరాలో...

వైరా, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణ విషయంలో మాదిగలను మోసగిస్తే కాంగ్రెస్‌ను ఖతం చేస్తామని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ హెచ్చరించారు. వైరాలో బుధవారం ఎమ్మార్పీఎస్ నిరాహారదీక్ష శిబిరాన్ని ప్రారంభించి ప్రసంగించారు. దీక్షల్లో కోట కోటేశ్వరరావు ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో దారెల్లి వెంకటేశ్వర్లు, అద్దంకి వెంకటేశ్వర్లు, కాంపాటి జమలయ్య, మోదుగు ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండలో...

ముదిగొండ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం రెండోరోజు రిలే నిరాహారదీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పడిశాల నాగేశ్వరరావు, యంగాటి నాగరాజు, బొడ్డు అనిల్, కోటి, జీవరత్నం పాల్గొన్నారు.

మధిరటౌన్‌లో...

మధిరటౌన్: ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తయి చట్టం అమల్లోకి వచ్చే వరకు ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్ డిమాండ్ చేశారు. బుధవారం మధిర తహసీల్దార్ కార్యాలయం ముందు ఎమ్మార్పీఎస్ చేపట్టిన నిరసన దీక్షకు బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో పాపట్ల రమేష్, చిలివేరు సాంబ, నాగేశ్వరరావు, కనకపూడి శ్రీను, రాజు, అక్కులు, తదితరులు పాల్గొన్నారు.

తల్లాడలో...

తల్లాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ జరుగకుండా గ్రూప్-1,2,3 ఇతర ఉద్యోగాలను భర్తీ చేస్తే కాంగ్రెస్ పార్టీకి పతనం తప్పదని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ ఏపూరి వెంకటేశ్వరరావుమాదిగ హెచ్చరించారు. బుధవారం స్థానిక రింగ్‌రోడ్డు సెంటర్లో ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలను ఇన్సెపల్లి అశోక్‌తో కలిసి

మహాప్రస్థానం, ఫ్రీజర్ బాక్సు ప్రారంభం

పెనుబల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాకతీయ కమ్మ సేవాసమితి ఆధ్వర్యంలో సుమారు రూ.5లక్షల వ్యయంతో ఏర్పాటుచేసిన మహాప్రస్థానం వాహనాన్ని ప్రముఖ వ్యాపారవేత్త కోటూరి అంకినీడు, ఫ్రీజర్ బాక్సును కనగాల సాంబశివరావు ప్రారంభించారు. బుధవారం వీఎంబంజర్‌లో కాకతీయ కమ్మ సేవాసమితి ఏర్పాటుచేసిన మహాప్రస్థానం వాహనాన్ని ఫ్రీజర్ బాక్స్ అన్ని సామాజిక వర్గాలకు అందుబాటులో ఉంటాయని దాత అంకినీడు తెలిపారు. కార్యక్రమంలో కనగాల సాంబశివరావు, నూర్పుదేవర రవికుమార్, బీకటి నర్సింహారావు, సుంకర సత్యనారాయణ, గోగినేని రమేష్, బెల్లంకొండ శ్రీనివాసరావు, మందడపు అశోక్ కుమార్, కొప్పుల గోవిందరావు, పల్లయ్య పాల్గొన్నారు.